

వార్త

2 జులై, 2023

ఆదివారం

బతుకులపై 'కల్తీ' కాటు

'ఉస్తాద్ భగత్‌సింగ్'లో మరో హీరోయిన్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు చేస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే.

ఈ హీరోయిన్‌తో పాటుగా మరో యంగ్ హీరోయిన్ కూడా ఈ చిత్రంలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల టాలీవుడ్‌కి పరిచయమైన సాక్షివైద్యను ఈ సినిమాలో తీసుకున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక స్పష్టత రాలేదు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

రవితేజ-శ్రీలీల జోడీగా మరో చిత్రం!



వరుస సినిమాలతో ఈ బ్యూటీ దూసుకుపోతోంది. ప్రస్తుతం ఆమె బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్, మహేశ్‌బాబు, నితిన్, రామ్, విజయ్‌దేవరకొండ, వైష్ణవ్‌తేజ్, నవీన్‌పోలిశెట్టి సినిమాలతో బిజీగా ఉంది. బాలకృష్ణ సినిమాలో ఆయనకు కూతురిగా కనిపించనుంది.

త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఆమె చేసిన 'ధమాకా' కథా కథనాల పరంగా, మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. శ్రీలీల డాన్సు బాగా చేస్తుందనే పేరు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలోనే మరోసారి ఆమె రవితేజ సరసన నటించనున్నట్టుగా తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ వారు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రవితేజ హీరోగా ఓ చిత్రం చేయనున్నారు. ఈ సినిమా కోసమే శ్రీలీలను ఎంపిక చేసినట్టు సమాచారం.

ఆదివారం వార్త
2 జులై, 2023

మంచి ముత్యాలు

మేఘము వర్షము లేకుండా ఇంద్రధనస్సు వుండదు. చింతించే హృదయమా! బాధను మాని ప్రశాంతంగా ఉండు. మేఘాల వెనుక సూర్యుడు ఇంకా ప్రకాశిస్తూనే ఉన్నాడు.

- జె.హెచ్.విన్సెంట్

విషయ విశేషం

కొబ్బరి చిప్పల కప్పులు.... 4

'సంఘీ'భావం....5

అన్నదాతలకు నకిలీ విత్తనాల బెడద

కవర్ స్టోరీ..6

బతుకులపై
'కల్తీ' కాటు

నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ..11

ఈవారం కవిత్వం..14

కనుల గదుల్లో..

మరింత క్షేమం!.....18

కథ.. 20

మాయాజాలం

సాహిత్యం..24

తాపీ ధర్మారావు-తెలుగు భాషా వికాసం

చందమామ రావే...26

పుట్టకు పాలు....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

తాజా వార్తలు

భవిష్యత్తులో భూమి

మన భూమి భవిష్యత్తులో ఎలా ఉండబోతోంది? సూర్యుడిలో శక్తి నిల్వలు తాగ్గాక భూమి పరిస్థితి ఏంటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం దొరికినట్లేనని భావిస్తున్నారు. కాలం చెల్లుతున్న నక్షత్రం తన గ్రహాన్ని మింగుతున్న తీరును శాస్త్రవేత్తలు తొలిసారిగా గుర్తించారు మరి. ఈ గ్రహం సుమారు గురుడిసైజులో ఉంది. సూర్యుడి నుంచి బుధుడు ఉన్నంత దూరంలో నక్షత్రం చుట్టూ భ్రమిస్తోంది. కేంద్రంలోని ఇంధనం నిండుకున్న తర్వాత నక్షత్రం పెద్దగా అవటం ప్రారంభించిందని, తన పక్కనున్న గ్రహం మధ్య దూరం తగ్గుతూ వచ్చిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎర్రటి భారీ నక్షత్రంగా మారి, చివరికి మొత్తం గ్రహాన్ని నక్షత్రం మింగేసిందని వివరిస్తున్నారు. ఎర్రటిభారీ నక్షత్రాల్లో ఇలాంటి పరిస్థితి ఏర్పడొచ్చని శాస్త్రవేత్తలు ఊహించినప్పటికీ నేరుగా చూడటం ఇదే తొలిసారి. సుమారు 500 కోట్ల సంవత్సరాల తర్వాత సూర్యుడిలో ఇలాంటి పరిస్థితే ఏర్పడనుంది. సూర్యుడి సైజు 100 రెట్లు పెరగొచ్చు. ఎర్రటి భారీ నక్షత్రంగా మారొచ్చు. ఈ క్రమంలో బుధుడు, శుక్రుడితో పాటు భూమిని మింగేయొచ్చు.

జోక్స్..జోక్స్

డాక్టర్: చెప్పమ్మా, మీ ఆయన బాధ ఏమిటి?
భార్య: బాధ ఆయనకు కాదు నాకు, మావారి కలలు నాకు వచ్చేట్లు చేయండి! ఆయన కలవరిస్తున్న అమ్మాయిలెవరో నాకు తెలియాలి?
డాక్టర్: ఆ జబ్బుకు ఇక్కడ చికిత్స లేదమ్మా!

...

గోపి: పెళ్లాలని భయపెట్టడానికి ఏవైనా పూజలున్నాయా సిద్ధాంతిగారూ?
సిద్ధాంతి: అస్తమానం ఇంట్లో బొద్దింకలు, బల్లులు తిరుగుతున్నాయని చెప్పు, పూజకు మించిన మందు ఇదే.

...

భార్య: పెళ్లి తరువాత మీరు నన్ను ప్రేమించడం లేదు..!
భర్త: ఎగ్జామ్ రాసాక కూడా ఎవరైనా చదువుతారా?

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



కొబ్బరి చిప్పల కప్పులు

కొబ్బరితో ఏ వంటకం చేసినా రుచిగా ఉంటుంది. కొబ్బరి చట్నీ, ఇడ్లీలు మంచి కాంబినేషన్ వంట. మనకు టెంకాయ కనిపించగానే చట్నీలు, ఇతర వంటకాలు గుర్తుకు వచ్చినట్లు కళాకారుల చేతిలో కొబ్బరి చిప్పలు పడితే, మంచి గృహోపకర వస్తువులు తయారవుతాయి. టీ, కాఫీ కప్పులతోపాటు స్పూన్లు, ఇంటి అలంకరణ వస్తువులు తయారైపోతాయి. మొక్కలు నాటే పూలకండీలుగా మారతాయి. అంతేకాదు ఇంటి డెకరేషన్లకు...రకరకాల వస్తువుల్ని తయారు చేస్తున్నారు నవతరం వ్యాపారులు. జనం అసలే ఎకో ఫ్రెండ్లీ వస్తువులను ఇష్టంగా కొంటున్నారు కాబట్టి ఆమెజాన్‌లో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి.

అచ్చంగా ఆర్గానిక్

కొబ్బరి చిప్పలను అందమైన వస్తువులుగా మార్చే ప్రక్రియలో ఎక్కడా రసాయనాలను వాడరు. యంత్రాలనూ పెద్దగా ఉపయోగించరు. నూరుశాతం సంప్రదాయ పద్ధతిలో అదీ చేతులతోనే కొకొనట్ బౌల్స్, స్పూన్లలాంటివి చేస్తారు. వీటి తయారీ కోసం కొబ్బరి చిప్పల ఉంచి నూనెను తీసే ఫ్యాక్టరీలతో ఒప్పందం చేసుకుంటారు. అక్కడ కొబ్బరి తీసేసిన చిప్పల్లో మంచి సైజులో, ఆకృతిలో ఉన్న వాటిని ఎంచుకుంటారు. వీటిని పాలిష్ చేసి, డిజైన్లు చెక్కుతారు. వీటిల్లో కాఫీ తాగొచ్చు. ఆహారపదార్థాలను తినవచ్చు.

'సంఘీ' భావం

అన్నదాతలకు నకిలీ విత్తనాల బెడద

సరిగ్గా వ్యవసాయ సీజన్ మొదలు అయ్యే సరికి మార్కెట్‌లో నకిలీ విత్తనాలు ప్రవేశించాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడ భారీగానే నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నప్పటికీ అంతకు మించిన స్థాయిలో నకిలీల విక్రయాలు జరుగుతున్నాయి. విత్తనంలో సత్తువ ఉంటేనే ఆశించిన మేరకు పంట దిగుబడి లభిస్తుంది. అయితే మార్కెట్‌లో ఉబ్బడిముబ్బడిగా నకిలీ విత్తనాలు అమ్ముతుండటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏది నకిలీయో, ఏది అసలో తెలియని అయోమయ పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. పంట వేసిన తరువాత దాని పెరుగుదల, దిగుబడులు చూసేవరకు విత్తనం నాణ్యమైనదా, నాసిరకమా అర్థం కాదు. ఈసారి వర్షాలు ఆలస్యంగా కురుస్తున్నాయి. దీనితో త్వరగా పొలం సిద్ధం చేసుకోవడానికి రైతులు తాపత్రయపడుతున్నారు. ఆలస్యం అయితే చివరి దశలో వచ్చే తుఫానుల వల్ల చేతికి అందే పంట దక్కకుండా పోయే ప్రమాదం ఉంటుంది. పొలం దుక్కిదున్నడానికి విత్తనాలకు, ఎరువులకు, క్రిమి సంహార మందులకు, కూలీలకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. తీరా పంట చేతికి వచ్చే సమయానికి విత్తనాలు నాసిరకంగా తేలడంతో దిగుబడి ఉండటం లేదు. వ్యవసాయ ప్రమాణాల ప్రకారం వంద విత్తనాల్లో కనీసం 75 శాతం మొలకెత్తితే అవి నాణ్యమైనవిగా పరిగణిస్తారు. స్వచ్ఛత, తేమ, మొలక శాతం సరిగా ఉన్నదీ లేనిదీ ప్రయోగశాలల్లో పరీక్షించిన తరువాతే విక్రయాల కోసం మార్కెట్‌లో ప్రవేశపెట్టాలి. అయితే కొన్ని రకాల నకిలీ విత్తనాలు మొలకెత్తుతాయి. ఎరువుల వాడటం తో అవి ఏపుగా పెరిగినా పూత మాత్రం కనిపించదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా మినుములు, సోయా చిక్కుడు, బిటీ పత్తి, వరి, మిరప, కూరగాయలు. మిర్చీ వంటి విత్తనాలు పెద్ద ఎత్తున నకిలీవి విక్రయిస్తున్నారు. గత సీజన్‌లో ఈ నకిలీల వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. మార్కెట్‌లో విచ్చలవిడిగా నాసిరకం విత్తనాలు రాజ్యమేలుతున్నా ఆశించిన మేరకు వీటిని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రైతులతో విత్తన పంటలు పండించి, శుద్ధి, నిల్వ చేయడానికి సంస్థలను ఏర్పాటు చేశారు. విత్తనాభివృద్ధి సంస్థ, సహకార మార్కెటింగ్ సమాఖ్య (మార్క్‌ఫెడ్), రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య (ఆయిల్ ఫెడ్), హైదరాబాద్ వ్యవసాయ సహకార సంస్థ (హాకా) వంటివి నాణ్యమైన విత్తనాల తయారీలో సహకరిస్తాయి. ఇది కాకుండా వ్యవసాయ శాఖ అధికా రులు నేరుగా విత్తన గ్రామ పథకంలో రైతులతో విత్తన పంటలు సాగుచేయిస్తారు. ఇవన్నీ సక్రమంగా పనిచేస్తే రైతులకు కావాల్సి న మేరకు విత్తనాలు అందించే అవకాశం ఉంటుంది. అయితే అనేక సమస్యల కారణంగా ఇవి పూర్తిస్థాయిలో పనిచేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో సకాలంలో నిధులు మంజూరు చేయక పోవడంతో మార్కెట్‌లో పెద్ద సంఖ్యలో విత్తనాలు విక్రయించే సంస్థలు వెలిసాయి. వీటిలో కొన్ని సంస్థలు ఆకర్షణీయమైన ప్యాకింగ్, అభూతకల్పనలతో పంట దిగుబడి హామీలు ఇచ్చి రైతులకు అంటగడుతున్నారు. నాణ్యమైన విత్తనాల పేరుతో బ్లాక్‌లో సైతం వీటిని విక్రయిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కొన్ని శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నారు. అయితే అక్కడి నుంచి ఫలితాలు సకాలంలో రాకపోవడంతో సీజన్ ప్రారంభమైందన్న ఆతృతతో రైతుల వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఫలితాలు ప్రతికూలంగా వస్తే ఆయా విత్తనాల అమ్మ కాలు నిషేధిస్తున్నారు. అయితే అప్పటికే ఆ విత్తనాలు వ్యవసాయ క్షేత్రాలకు చేరిపోతున్నాయి. సంస్థల యాజమాన్యాలు డబ్బు అందడంతో లాభాల్లో ఉంటున్నారు. వీటిని కొనుగోలు చేసిన రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. నిబంధనల ప్రకారం పరిశోధనా క్షేత్రంలో తయారయ్యే విత్తనం వివిధ దశల్లో పరీక్షలు పూర్తి చేసుకుని రైతులకు అందాలంటే కనీసం ఏడేళ్లు పడుతుంది. తెగుళ్ల తట్టుకుని, అధిక దిగుబడులు సాధించేలా ఉందని ప్రయోగాల్లో నిరూపితం అయిన తరువాతనే మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశం కల్పిస్తారు. అయితే ప్రైవేటు సంస్థలు కొన్ని ఏడాదికో కొత్త వంగడాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవడానికి సరైన నిబంధనలు లేవు. నకిలీ విత్తనాలు విక్రయించిన వారిని అరెస్టు చేసి బెయిల్ ఇచ్చి పంపించేస్తున్నారు. భారీ ఎత్తున పంట దిగుబడులు తగ్గడానికి, రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకువచ్చే వీరిపై కేవలం ఐపిసి 420 వంటి సెక్షన్లను విధిస్తున్నారు. వ్యవసాయ శాఖ నిందితులపై చర్యలు తీసుకోవడానికి అవకాశాలు లేకపోవడంతో పోలీసులు కొన్ని సందర్భాల్లో వారిపై పిడి చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ శిక్షలు వేసే సమయంలో ఉత్పత్తిదారులు, డీలర్లు కాకుండా కింది స్థాయి సిబ్బంది, షాపుల్లో పనిచేసే కార్మికులను నిర్వాహకులు చట్టం ముందు నిలబెట్టి వారు తప్పించుకుంటున్నారు. నాణ్యత వివరాలు వారంలోగా అందేలా చర్యలు అధికారులు చర్యలు తీసుకోవాలి. విత్తన ఏజెన్సీపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి అధికారాలు ఉండేలా నిబంధనల్లో మార్పులు తీసుకు రావాలి. రైతులు విత్తనాల ప్యాకెట్ పై ఉన్న వివరాలను పరీక్షించాలి. పంట చేతికి వచ్చే వరకు డీలర్ ఇచ్చిన రశీదులను జాగ్రత్త చేసి ఉంచాలి. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి. రైతులు ముందుగా తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆశిం చిన మేరకు పంటను దిగుబడి చేసుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

బతుకులపై 'కల్తీ' కాటు

నేడు కల్తీ అనే పేరు నలు దిశలా వినిపిస్తుంది. నిత్యావసర వస్తువులలో అనవసర పదార్థాలను కలిపి చలామణి చేయడం నేరం. దీనినే కల్తీ చేయడం అంటారు.

ఈ కల్తీ సరుకుల వల్ల ప్రజలు అనారోగ్యంపాలు అవుతున్నారు. సమయం కలిసిరాకపోతే ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. ఇప్పుడు ఉప్పు, పప్పు, కాలికి తొడిగే చెప్పుల నుండి పసిపిల్లలు తాగే పాలు, పాలపొడి నుండి వ్యాధిగ్రస్తులు వేసుకునే మందుల వరకు కల్తీ చేస్తూ కాదేదీ కల్తీకి అనర్హం అని రుజువు చేస్తున్నారు మన కల్తీరాయుళ్లు. ధనార్జన చేయాలనే స్వార్థంతో ఇటువంటి కొందరు చేస్తున్న కల్తీ వలన ప్రజలు రోగాలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకప్పుడు తినే వస్తువులలో వేరే పదార్థాలు కలిపి కల్తీ చేసేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. కల్తీరాయుళ్ళు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కల్తీలు చేస్తున్నారు. ఖరీదైన వంటనూనెలో, తక్కువ ఖరీదు వంటనూనెలను కలుపుతారు. దీనివల్ల వినియోగదారుడికి పూర్తి స్థాయిలో అనారోగ్యం కలగకపోయినప్పటికీ ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుంది. మరికొందరైతే తెలివిగా నాణ్యమైన సరుకులో, నాణ్యతలేని సరుకులను కల్తీ చేసి లాభార్జన చేస్తున్నారు. పచ్చిపప్పుతో శనగపిండిని చేస్తుంటారు. ఒకప్పుడు బఠానీపిండిని ఇందులో కలిపి కల్తీ చేసేవారు. ఇప్పుడు కల్తీరాయుళ్ళు తెలివిమీరిపోయి నాణ్యత లోపించిన, విడిగా అమ్ముడుపోని పుచ్చు, సచ్చు పచ్చిపప్పును సైతం ఇందులో వేసి పిండి చేసి, అందులో రంగు కలిపి ఆకర్షణీయంగా తయారుచేసి అమ్మేస్తున్నారు.

ఒకప్పుడు కల్తీ చేసే పద్ధతులు

ఒకప్పుడు కల్తీ చేసే ప్రక్రియల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగి వాటి పట్ల జాగ్రత్త వహిస్తున్నారు. కల్తీ జరిగితే ఎలా కనిపెట్టాలి? అనే విషయం ప్రజలు తెలుసుకుని అప్రమత్తంగా మెలగసాగారు. భారత ఆహార పరిరక్షణ, నాణ్యతా ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) తరచూ కొన్ని చిట్కాలను ప్రజలతో పంచుకుంటుంది. 'డిటెక్టింగ్ ఫుడ్ అడల్ట్రేట్స్' పేరుతో సామాజిక మాధ్యమాల వేదికగా కొన్ని వీడియోలు పంచుకుంటుంది. వీటి ద్వారా మనం తీసుకునే ఆహార పదార్థాలు మంచివా? కల్తీవా? అనే విషయాలపై సులభంగా అవగాహన కల్పిస్తోంది. ఆహార పదార్థాల నాణ్యత, స్వచ్ఛతకు సంబంధించి ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రజలతో పంచుకున్న కొన్ని చిట్కాలతో పాటు ఒకప్పటి కల్తీ నుండి నేటి కల్తీల వరకూ ఎలా జరుగుతున్నాయో తెలుసుకుందాం.

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హాకీం జాని

చక్కెరలో సుద్ద: చక్కెరలో సుద్దను కలిపేవారు. పారదర్శక గాజుగ్లాసులోకి మంచినీరు తీసుకోవాలి. అందులో పది గ్రాముల చక్కెర కలపండి. అడుగు భాగంలో సుద్ద పేరుకుంటే అది కల్తీదే. కొందరైతే పానీయాలలో తీపిని పెంచేందుకు చక్కెరకు బదులు చాక్రిన్‌ను వాడుతున్నారు. ఇటువంటివి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి.

పాలల్లో నీళ్లు: నున్నగా, ఏటవాలుగా ఉన్న ఏదైనా వస్తువు ఉపరితలంపై పాలచుక్కను వేయండి. స్వచ్ఛమైన పాలైతే అది నిలిచి ఉంటుంది. లేదా నెమ్మదిగా కిందికి జారుతుంది. ఆ క్రమంలో తెల్లటి మరక ఏర్పడుతుంది. నీళ్ల కలిపిన పాలైతే వెంటనే జారిపోతుంది. మరక ఏర్పడదు. ఇటీవల కొన్ని ప్రాంతాలలో పాలల్లో కొన్ని రసాయనాలు, పాలకు సంబంధం లేని రసాయన పిండి పదార్థాలను కలిపి చిక్కనైన చక్కని పాలు తయారుచేసి అధిక ధరకు అమ్ముతున్నారు. పలుచోట్ల తనిఖీల లో వీరి గుట్టు రట్టు కేసులను నమోదు చేయడం జరిగింది.

గోధుమ పిండిలో ఊక: పారదర్శక గాజుగ్లాసులోకి మంచినీరు తీసుకోవాలి. దానిలో ఒక చెంచా గోధుమ పిండిని చల్లండి. స్వచ్ఛమైన గోధుమ పిండి నీటిలో కలిసిపోతుంది. పిండిలో కల్తీ కలిపిన ఊక మాత్రం పైభాగంలో తేలుతుంది.

పసుపు కల్తీ: సింథటిక్ రంగులు, చాక్ పౌడర్లు, రంగులు లేదా రసాయనాలు పసుపుకు కలుపుతారు. వాటిని పరీక్షించడానికి ఒక గ్లాసులో గోరువెచ్చని నీటిని తీసుకుని, దానికి ఒక చెంచా పసుపు

జోడించండి. పసుపు కరిగి ముదురు పసుపు రంగులోకి మారితే అది కల్తీ అని అర్థం. అదే స్వచ్ఛమైన పసుపు అయినట్లైతే పసుపంతా నీటి అడుగు భాగానికి చేరుకుంటుంది.

తేనెలో చక్కెర

పారదర్శకంగా ఉండే గాజుగ్లాసులో మంచి నీటిని తీసుకోవాలి. ఇందులో ఒక చుక్క తేనెను వేయాలి. స్వచ్ఛమైన తేనె నీటిలో కరిగిపోదు. ఒకవేళ తేనె నీటిలో అదృశ్యమైతే, అందులో చక్కెర కలిసినట్లే. మరో పరీక్ష ద్వారా కూడా తేనె నాణ్యతను తెలుసుకోవచ్చు. పత్తితో చేసిన వత్తిని స్వచ్ఛమైన తేనెలో ముంచి వెలిగిస్తే వెలుగుతుంది. ఒకవేళ కల్తీ తేనె, చక్కెర, బెల్లంపాకం కలిపితే అంటుకోదు. అంటించడానికి ప్రయత్నిస్తే చిటపటలాడుతుంది.

దాల్చిన చెక్క

తరచుగా దాల్చిన చెక్క పేరుతో చైనీస్ కాసియాను విక్రయిస్తారు. రెండూ ఒకేలా ఉంటాయి. కానీ నిజమైన దాల్చినచెక్క సువాసన చాలా బాగుంటుంది. సన్నగా ఉంటుంది. కాసియా కరుకుగా మందంగా ఉంటుంది. దీని సువాసన కూడా చాలా తక్కువ. దాల్చిన చెక్కపొడిపై అయోడిన్ చుక్క వేయండి. పౌడర్ నీలం రంగులోకి మారితే అది కల్తీ అని అర్థం.

కూరగాయలపై ఆకుపచ్చ

దూదిముద్దను నీటిలోగానీ, వంటనూనెలోగానీ ముంచి కూరగాయలపై రుద్దాలి. దూదికి ఆకుపచ్చ రంగు అంటితే ఆ కూరగాయలు రంగుపూతకు గురైనట్లే. ముఖ్యంగా పచ్చి బఠానీతో పాటు అనేక ఆకుకూరలను రంగుల్లో ముంచి అందంగా, తాజాగా కనిపించేలా తయారుచేసి అమ్మేస్తున్నారు.

కారంలో చెక్కపొట్టు

నీటితో నిండిన పారదర్శక గాజుగ్లాసులో కారంపొడిని కలపాలి. స్వచ్ఛమైన కారంపొడి నీటి అడుగు భాగానికి చేరుతుంది. చెక్కపొట్టు పైభాగంలో తేలియాడుతుంది. నేడు కల్తీరాయుళ్లు మరో అడుగు ముందుకు వెళ్లి కారం బాగా రంగు వచ్చేందుకు ఇటుకపొడి, ఇసుక, సోప్‌స్టోన్ పౌడర్, ఉప్పు, ట్కాలం పౌడర్, ఇతర సింథటిక్ ఉత్పత్తులను కలిపేస్తున్నారు. ఇటువంటి కారం వంటల్లో కలిపి తింటే కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఒక గ్లాసు నీటిలో ఒక టీ స్పూను కారంపొడి కలపాలి. కొద్దిసేపయ్యాక నీటి అడుగు భాగంలో ఉన్న కారం నీటిలో ఒక టీ స్పూన్ కారంపొడిని కొద్దిగా అరచేతిలోకి తీసుకుని వేలితో రుద్దాలి. రాళ్లలా గట్టిగా అనిపిస్తే అందులో ఇటుకపొడి లేదా ఇసుక కలిపినట్లు. అలా కాకుండా సబ్బులా మృదువుగా అనిపిస్తే కారంలో సోప్ స్టోన్ పౌడర్ కలిపారని అర్థం చేసుకోవాలి.

కారంలో రంగులు

కృత్రిమ రంగు, సింథటిక్ డై, డిటర్జెంట్, ఇటుకపొడి, టాల్క్ మొదలైనవి ఎండుమిరపకాయల్లో కలిపి కారం తయారు చేయడం పాత పద్ధతి. నేడు కొత్త పద్ధతులు వచ్చేశాయి. నాణ్యమైన ఎండు మిరపకాయల్లో తాలు మిరపకాయలు, వాటి తొడాలు కూడా వేసి

కారం తయారుచేసి ఇందులో మోతాదుకు మించి రంగు కలిపి ఆకర్షణీయంగా తయారుచేసి నాణ్యమైన కారంగా చెలామణీ చేస్తూ అధిక ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఉప్పులో సుద్ద

నీటితో నిండిన గాజుగ్లాసులో కాసింత ఉప్పును కలపాలి. స్వచ్ఛమైన ఉప్పు అడుగు భాగంలోకి చేరుతుంది. సుద్ద కలిపిన ఉప్పు తెల్లని ద్రావణంగా మారుతుంది.

ఈ విధమైన కల్తీలు చేయడం ఒకనాటి మాట. ఇటువంటి విషయాల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. దాంతో కల్తీరాయుళ్లు ఆధునిక ప్రక్రియల్లో కల్తీలు చేస్తున్నారు. వాటి గురించి కూడా తెలుసుకుందాం.

ప్రస్తుతం మార్కెట్లో లభించే అనేక నిత్యావసర వస్తువుల్లో కల్తీ జరుగుతున్నది అనే విషయం జగమెరిగిన సత్యం. పాలు, నీళ్లు, కారం, ఉప్పు, పసుపు, మసాలా దినుసులు.. ఇలా మార్కెట్లో దొరికే పదార్థాలన్నింటినీ కల్తీ చేస్తున్నారు మార్కెట్ కల్తీగాళ్లు. అన్ని మసాలా దినుసులను సరైన పరిమాణంలో చేర్చినప్పటికీ, మనం అనుకున్నట్లు ఆహారంలో రుచి రాదు. దీనికి కారణం కల్తీ మసాలాల సరుకును నాణ్యమైన వాటిలో కలపడమే. ఇలా చేయడం వల్ల సుగంధ ద్రవ్యాలు సైతం సహజత్వాన్ని కోల్పోతున్నాయి. అటువంటి సమయంలో వాటి వాసన, పరిమానాన్ని పెంచడానికి, వాటి రంగు, ఆకృతిని పోలి ఉండే వస్తువులు కల్తీ చేస్తుంటారు. ఉదాహరణకు.. ఎర్ర మిరపకాయలో ఎర్ర ఇటుకపొడి లేదా డిటర్జెంట్ కలుపుతారు. ఎండిన బొప్పాయి గింజలను కూడా ఎండుమిర్చిలో కలుపుతారు. ఇతర పదార్థాలు కలపడం వల్ల కల్తీని తేలికగా గుర్తిస్తున్నారు. ఆ కారణంగా ఇప్పుడు నాణ్యమైన సరుకులో నాణ్యత లోపించిన సరుకును కలపడం వల్ల లాభార్జన చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల వినియోగదారుడి ఆరోగ్యానికి ఎటువంటి నష్టం కలగకపోయినప్పటికీ ఆర్థికంగా

నష్టపోతున్నాడు. కొన్ని రకాల కల్తీలు వినియోగదారుడిని రోగాలపాలు చేస్తే మరికొన్ని రకాల కల్తీలు ఆర్థికంగా దెబ్బతినేలా చేస్తున్నాయి.

నెయ్యి కల్తీ: ఇందులో ఎక్కువగా వనస్పతిని కలిపి అన్ని ప్రముఖ సంస్థల పేర్లతోనూ విపణిలోకి తీసుకొస్తున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలో స్వచ్ఛమైన నెయ్యి గడ్డ కట్టదు. బాగా చల్లని వాతావరణంలో కొద్దిగా గడ్డ కడుతుంది. వనస్పతిని కలిపిన నెయ్యి సాధారణ వాతావరణంలోనూ గడ్డ కడుతుంది. వేడి చేస్తేగానీ కరగదు.

పండ్లు కల్తీ: మామిడి, అరటి పండ్లను ప్రత్యేక రసాయనాల్లో మగ్గబెడుతున్నారు. ఈ రసాయనాలు ఉపయోగించడం వల్ల ఆ పండ్ల పైపొర రంగు మారి

పండినట్లు కనిపిస్తుంది. కానీ లోపల మాత్రం పచ్చిదనం అలాగే ఉంటుంది. ఇటువంటి పండ్లు తినడం వల్ల రోగాలపాలు కాక తప్పదు.

నూనె కల్తీ: 'బ్లెండెడ్ వెజిటెబుల్ ఆయిల్' పేరుతో రెండు రకాల నూనెలను కలిపి విక్రయిస్తారు. 'బ్లెండెడ్' అనే పదాన్ని చాలా చిన్నగా ముద్రించి అమ్ముతుంటారు. ఉదాహరణకు వేరుశనగ నూనె(80 శాతం), పామాయిల్(20 శాతం)ను కలిపి ఒక కిలో ప్యాకెట్ చేస్తే ఏది ఎంత మోతాదులో ఉందో స్పష్టంగా కనిపించేలా ముద్రించాలి. కానీ ఉత్పత్తిదారులు తక్కువ ధర ఉన్న నూనెను ఎక్కువ మోతాదులో కలిపి ఆ వివరాలేవీ కనిపించకుండా 'వేరుశనగ'ల బొమ్మలను కవరుపై పెద్దగా ముద్రిస్తారు. దీనివల్ల వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతారు. కొందరైతే బ్రాండెడ్ నూనె కంపెనీల పేరు, ప్యాకింగ్‌లను తయారు చేసి, తక్కువ ధర నూనెతో ప్యాకింగ్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇటువంటివారి గుట్టురట్టు అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

మాంసం కల్తీ

పశువైద్య నిపుణుల ఆమోదముద్ర ఉన్న మేకలు, గొర్రెల మాంసాన్ని విక్రయించాల్సి ఉండగా అన్ని చోట్ల అది అమలు కావడం లేదు. ఖరీదైన గొర్రె మాంసంలో ఖరీదు తక్కువ గొడ్డుమాంసం కలిపేసి అమ్మిన సందర్భాలు అనేక ఉన్నాయి. కొన్ని నగరాలలో గొర్రెమాంసం బిర్యానీ తినడానికి చాలామంది భయపడతారు. అందులో గొడ్డుమాంసం కలుస్తుందని దృఢంగా నమ్మేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఇందులో సత్యం లేకపోలేదు. చేపలు ఆరోగ్యానికి చాలా మంచిదని భావిస్తుంటారు. చాలా చోట్ల చెరువుల్లో పెంచే చేపలకు కోడిమాంసం నుండి వచ్చిన వ్యర్థాలను ఆహారంగా వేస్తున్నారు. ఇటువంటి చేపలను తినడం ఆరోగ్యానికి హానికరం. కోళ్ల వేగంగా ఎదిగేందుకు, బరువు పెరిగేందుకు వాటి మెడకు సూదిమందు వేస్తుంటారు. ఇటువంటి కోడిమాంసం కూడా అనారోగ్యంపాలు చేస్తుంది.

నకిలీ బాసుమతి బిర్యానీ

బాసుమతి బియ్యం పేరు చెప్పి, దాన్ని పోలిన పొడవాటి తక్కువ రకం బియ్యాన్ని వండి బాసుమతి బిర్యానీ అని మోసం చేస్తుంటారు. నాణ్యమైన బాసుమతి బియ్యం పొడవుగా ఉండి ఒక రకమైన పరిమళాన్ని వెదజల్లుతుంటాయి. ఖరీదైన బాసుమతి బియ్యంలో ఎటువంటి పరిమళం లేని, తక్కువ ధరగల లాంగ్స్ అనే బియ్యాన్ని కల్తీగా కలుపుతున్నారు. ఈ బియ్యం చూడటానికి బాసుమతి బియ్యంలా పొడవుగా ఉంటాయి. వీటిలో ఎటువంటి పరిమళం ఉండదు. ఇటువంటి బియ్యం కొనడం వల్ల వినియోగదారుడి ఆరోగ్యానికి ఎటువంటి హాని కలుగకపోయినప్పటికీ ఆర్థికంగా నష్టపోతాడు. చికెన్, మటన్, బిర్యానీలు, తందూరీ చికెన్‌లలోనూ రంగులేస్తుంటారు. ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్‌ను దోరగా వేయించి, వేలాడదీసి అమ్ముతుంటారు. చిత్రమైన రంగులో మెరుస్తుంటుంది. ఇలా రంగు రావడానికి చికెన్‌కు రంగులు వేసి ఆకర్షణీయంగా తయారుచేసి సొమ్ము చేసుకుంటున్నారు.

మిఠాయిలు కల్తీ

ఆహార పదార్థాలలో పరిమిత స్థాయిలో రంగులేయాల్సి ఉంటుంది. కిలో పరిమాణానికి 10 మి .గ్రా రంగువేయాలి. అది కూడా అనుమతించిన రంగునే వేయాలి. చాలామంది ఈ ప్రమాణాలు పాటించరు. కొన్ని మిఠాయి దుకాణాల్లో నిషేధిత 'మెటానిల్' పసుపురంగును జిలేబీల తయారీలో, 'రొడొమిన్ బి' పింకురంగును పీచు మిఠాయిలకు వాడుతుంటారు. కొన్ని మిఠాయిలపై వెండి రేకుల భ్రమించే తరగం అంటిస్తారు. ఇటువంటివి తింటే కేన్సర్ బారిన పడతారు. జనం కూడా ముదురురంగుతో, అందంగా, ఆకర్షణీయంగా కనిపించే మిఠాయిలను కొనడానికే ఎగబడి, వాటిని తిని కోరి మరీ

జబ్బులు తెచ్చుకుంటుంటారు.

నకిలీ విత్తనాలు- ఎరువులు

ఆరుగాలాలు కష్టించి పనిచేసే రైతన్నను సైతం కల్తీ భూతం వదలడం లేదు. నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తున్నారు. ఎరువుల్లో సైతం కల్తీ కలిపి రైతన్న శ్రమను దోచుకుంటున్నారు. ఎరువుల్లో కల్తీ అనేక రకాలుగా ఉంటుంది. కొందరు వ్యాపారులు ఎరువులను అక్రమ పద్ధతుల్లో విక్రయిస్తారు. తక్కువ ధర కలిగిన ఒక రసాయన ఎరువును, ఎక్కువ ధర ఉండే వేరే రసాయన ఎరువు పేరుతో అమ్మడం, చలామణిలో ఉన్న ఎరువును పోలిన నకిలీ ఎరువును కానీ ప్రత్యామ్నాయంగా మరొక దానిని కానీ ఆ పేరుతో అమ్మడం, నిర్ణయించిన ప్రమాణాలు లేకున్నా అవి ఉన్నట్లు బస్తాలపై ముద్రించి అమ్మడం చేస్తున్నారు. ఇవి కాక యూరియా, అమ్మోనియం క్లోరైడ్, అమ్మోనియం సల్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వంటి ఎరువుల్లో ఉప్పు కలిపి కల్తీ చేస్తారు. సూపర్ ఫాస్ఫేట్, రీలేటెడ్ జింక్‌లో సున్నం, డి.ఎ.పి., ఇతర కాంప్లెక్స్ ఎరువులలో బొగ్గు, పొటాష్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లలో ఇసుక, డి.ఎ.పి..ఇతర ఎరువులలో నల్లమట్టి, సూపర్ ఫాస్ఫేట్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ ఇత్యాదివి కలిపి కల్తీ చేస్తున్నారు.

నగరాల్లో ఆహార కల్తీ

నగరాల్లో కల్తీ విచ్చలవిడిగా విజృంభిస్తుంది. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు స్వార్థపరులు చేసే కల్తీల వల్ల ప్రజలు భయంకర వ్యాధులకు లోనై ప్రాణాలు విడుస్తున్నారు. పెద్ద నగరాలలోని ప్రజలు న్యూడిల్స్, మంచురియాలలో టమాటా సాస్ కలుపుకుని తింటుంటారు. ఈ సాస్‌ను కూడా కల్తీ చేస్తున్నారు. టమాటా సాస్‌లలో టమాటో లేకుండానే తయారు చేస్తున్నారు. గుమ్మడికాయల గుజ్జు, మైదా, గంజిపొడి, ఎర్రరంగుతో టమాటా సాస్ తయారు చేస్తున్నారు. బొప్పాయి విత్తనాలతో మిరియాలు, బొంబాయి రవ్వతో నకిలీ గసగసాలు చేస్తున్నారు. చీపురు ముక్కలకు రసాయనాలు జతచేసి నకిలీ జీలకర్ర, చెడిపోయిన అల్లంతో నకిలీ శొంఠి, కుళ్లిన దుంపలు, అరటిబోదెలు, రసాయనాలతో అల్లం-వెల్లుల్లి ముద్ద, జంతు కళేబరాలను మరిగించి నూనె, నెయ్యి తయారు చేస్తున్నారు. నీరు, పాలపొడి, కొన్ని రసాయనాలు కలిపిన పొడితో హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపిన పాల తయారీ, అపరిశుభ్రమైన జనరల్ వాటర్‌ను బాటిళ్లలో నింపి మినరల్ వాటర్‌గా మోసం చేస్తున్నారు. చాలా పానీయాలు పండ్లతో కాకుండా ఎసెన్స్‌తో తయారు చేస్తున్నారు. నిమ్మకాయను కాకుండా నిమ్మ ఉప్పుతో లెమన్‌వాటర్ తయారు చేయడం, మనకు దొరకని పండ్ల సువాసనలు వెదజల్లే రసాయనాలతోపాటు రంగులు కలిపి పానీయాలు తయారుచేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇవి కాక పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్, కొన్ని రకాల బేకరీ పదార్థాలు, రంగులు కలిపిన పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు ఇత్యాది ఆరోగ్యానికి మేలు చేయని నకిలీ, కల్తీ ఆహార పదార్థాలను తినడం వల్ల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుంది. దేశంలోని మరణాల్లో 70శాతం ఆహార సంబంధమేనని వెల్లడైంది.

ఇండియన్ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ నిబంధనలు

ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉండాలనే విషయంపై భారత ఆహార పరిరక్షణ, నాణ్యతా ప్రమాణాలు సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఐ) వారు కొన్ని నియమ నిబంధనలు రూపొందించారు. ఆహార తయారీ వ్యాపారాలు తప్పనిసరిగా వీటిని పాటించాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనేది 2006లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టం ప్రకారం స్థాపించబడిన ఒక చట్టబద్ధమైన సంస్థ. ఆహార భద్రతపై సరైన నియంత్రణ, పర్యవేక్షణ ద్వారా ప్రజారోగ్యాన్ని రక్షించడం, ప్రోత్సహించడం కోసం బాధ్యత వహిస్తుంది. ఈ చట్టం ఆహార పదార్థాల కోసం సైన్స్ అథారిటీ ప్రమాణాలను నిర్దేశించడానికి, వాటి తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకం, దిగుమతిని నియంత్రించడానికి, మానవ వినియోగానికి సురక్షితం, ఆరోగ్యకరమైన ఆహారం లభ్యతను నిర్ధారించడానికి అధికారం ఇస్తుంది. సురక్షితం, పరిశుభ్రంగా ఉండే ఆహారాన్ని తినడం ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయడానికి ఈ సంస్థ బాధ్యత వహిస్తుంది. ఫుడ్ అథారిటీకి కొన్ని ప్రధానమైన విధులున్నాయి. ఆహార, పానీయాల పరిశ్రమలో మోసపూరిత ప్రకటనలు పర్యవేక్షించడానికి అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సెల్ ఆఫ్ ఇండియాతో కలిసి పని చేస్తుంది.

ఆహార ఉత్పత్తుల కోసం సైన్స్ ఆధారిత ప్రమాణాలను ఏర్పాటు చేయడం, వాటి తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకం, నాణ్యమైన ఉత్పత్తుల దిగుమతిని నియంత్రించడం, ఇది చివరికి మానవ వినియోగానికి ఆరోగ్యకరమైన, సురక్షితమైన ఆహారం లభ్యతకు హామీ ఇస్తుంది.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఐ) సంస్థ బాధ్యతలు

ఆహార భద్రత, అవగాహనకు సంబంధించిన నియమనిబంధనలను వివరించడం, ఆహార పదార్థాలలోని కలుషితాలకు సంబంధించిన డేటాను సేకరించడం, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల కోసం ప్రక్రియలు, నిబంధనలను రూపొందించడం, అర్హత కలిగిన ఆహార వ్యాపారాలకు ఆహార లైసెన్సులు మంజూరు చేయడం, ఆహార రంగం, ఆహార సరఫరాలో జరిగే ప్రమాదాలను గుర్తించడం, కొత్త పాలసీలను రూపొందించడం, భారత ప్రభుత్వం ఆదేశాలను అమలు చేయడం, ప్రజలకు అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలతో సమస్యలను గుర్తించడానికి హెచ్చరిక చేయడం, ఆహార వ్యాపారాల్లో నిమగ్నమైన, పాల్గొనాలని భావించే వ్యక్తుల కోసం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం, ఆహారం, పారిశుధ్యం, ఫైటో శానిటరీ ప్రమాణాల కోసం అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాల అభివృద్ధికి దోహదం చేయడం ఇత్యాది అనేక బాధ్యతలను ఈ సంస్థ నిర్వహిస్తుంది.

ప్రాంతీయ కార్యాలయాలు

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఐ) ప్రస్తుతం 4 ప్రాంతీయ కార్యాలయాలతో తన పరిపాలను కొనసాగిస్తుంది. న్యూఢిల్లీలో దీని ప్రధాన కార్యాలయం ఉంది. ఇది హర్యానా, ఉత్తరాఖండ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, లడఖ్, జమ్మూ-కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాల పర్యవేక్షణ చేస్తుంది. ముంబైలో ప్రధాన కార్యాలయం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా, దాదర్ నగర్ హవేలీ, దామన్ దీవులు ప్రాంతాల పర్యవేక్షణ, చెన్నై ప్రధాన కార్యాలం తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేంద్రపాలితలు పుదుచ్చేరి, లక్షదీప్ ప్రాంతాల పర్యవేక్షణ చేస్తుంటాయి. కోల్‌కతా కార్యాలయం పశ్చిమబెంగాల్, ఒరిస్సా, బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మణిపూర్, మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్, అస్సాం, (గౌహతి ప్రాంతీయ కార్యాలయం) ఇత్యాది ప్రాంతాలను పర్యవేక్షిస్తుంది.

విచ్చలవిడిగా ఆహార పదార్థాల కల్తీ

కల్తీ ఆహార పదార్థాలు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. కొందరు తయారీదారులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఆయా

ఆహార పదార్థాలపై తయారీ తేదీ, ఎంత కాలంలోగా విని యోగించాలనే వాటిని ముద్రించకుండానే విక్రయిస్తున్నారు. సుగంధ ద్రవ్యాలు, నెయ్యి, డాల్డా, పోపుగింజలు, మసాల దినుసులు, పొడులు, పసుపు, కారం తదితర వస్తువులతోపాటు పచ్చళ్ళు, తదితర వస్తువులను పాలిథిన్ ప్యాకెట్లలో ప్యాక్ చేసి హోల్‌సెల్,రిటైల్ షాపులకు సరఫరా చేస్తున్నారు. ఆయా షాపుల నుంచి దుకాణాల ద్వారా వినియోగదారు లకు చేరుతున్నాయి. పాలల్లో డిటర్జంట్ పొడి, యూరియా, గంజి కలిపి కల్తీ చేస్తున్నారు. తేనెలో పంచదార, బెల్లం పాకం కలుపుతున్నారు. ఐస్‌క్రీమ్‌లో వాషింగ్ పౌడర్‌లు, అనుమతిలేని రంగులు కలుపుతున్నారు. మెరుపు వచ్చేందుకు యాపిల్ వంటి పండ్లపై మైనంను పూతగా పూస్తున్నారు. ఉప్పులో సుద్దపొడి కల్తీగా వాడుతున్నారు. ఒకచోట కల్తీ జరుగుతుందంటే ఎవరైనా నిఘా పెట్టగలరు. అడుగడుగునా కల్తీ మయమైనప్పుడు ఇంతమంది కల్తీ రాయుళ్లను కనిపెట్టడం పెద్ద సమస్యగా మారింది. సిబ్బంది కొరత వల్ల కల్తీ ఆహారపదార్థాల నివారణకు తూనికలు, కొలతలు, పౌర సరఫరాలు, కల్తీ నిరోధక శాఖ, విజిలెన్స్ వాణిజ్య పన్నులశాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. పైగా కల్తీని కనిపెట్టే ప్రయోగశాలలు పెద్ద నగరాలకే పరిమితమయ్యాయి. అక్కడి నుండి నివేదిక రావడానికి చాలా సమయం పడుతుంది. ఈలోగా నిందితులు చట్టాలను చుట్టాలుగా చేసుకునే పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఆహార సంబంధిత వ్యాధుల కారణంగా ఏటా 1500 కోట్ల డాలర్ల మనదేశం నష్టపోతున్నట్లుగా లోగడ అధ్యయనాలు వెలువడ్డాయి. కేన్సర్ వంటి దాదాపు రెండొందల రుగ్మతలకు కల్తీ తిండి కారణభూతమవుతోందని వైద్యవర్గాలు హెచరిస్తున్నాయి. కొన్ని దేశాలలో ఇటువంటి కల్తీ అక్రమార్కులకు కఠినమైన శిక్షలు వేసి ఉక్కుపాదం మోపారు. అటువంటి శిక్షలు మనదేశంలో కూడా అమలు కావలసిన అవసరం ఉంది. వంట నూనెల నియంత్రణ చట్టం 1947, నిత్యావసర సరకుల చట్టం 1955, ఆహార కల్తీ నిరోధక చట్టం 1954, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం 1992 తదితర చట్టాలు ఉన్నప్పటికీ కల్తీలను అరికట్టలేకపోతున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వారి నియమ నిబంధనలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేయని సంస్థలపై చర్యలు తీసుకోవాలి. మనకు చాలా చట్టాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో కల్తీరాయుళ్లు భయపడే విధమైన శిక్షలు అమలు జరిగితేనే వీటిని అరికట్టగలమనేది జగమెరిగిన సత్యం. కల్తీలను అరికట్టడం ప్రభుత్వంతో పాటు దాని అనుబంధసంస్థది మాత్రమే బాధ్యత అని భావించరాదు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించి ప్రభుత్వానికి సహకరిస్తే కల్తీని కొంతలో కొంత తగ్గించవచ్చు. ❑

నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ

డాక్టర్ దేవరాజు మహారాజు

సైన్స్ ప్రమేయం లేకుండా ఈ విశాల విశ్వంలో ఏదీలేదు. ఏ విషయం తీసుకున్నా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అది సైన్స్‌తో సంబంధం కలుపుకోవాల్సిందే. కొన్నికోట్ల మంది యాత్రికులు బస్సుల్లో, రైళ్లల్లో, విమానాలలో వారివారి ధార్మిక కేంద్రాలకు వెళ్లి వస్తున్నారంటే, కంప్యూటర్ ద్వారా రిజర్వేషన్లు జరుగుతున్నాయంటే, దేవుడు వ్యవహారాలన్నీ 'ఆన్‌లైన్'లో జరుగుతున్నాయంటే, అందుకు సైన్స్ కారణం. సైన్స్‌కు దేవుడు అవసరం లేకపోయినా, దైవభావన నిలవడానికి మాత్రం సైన్స్ అవసరం ఉందన్నది ప్రత్యక్షంగా కనిపిస్తున్న సత్యం. మీరు ఏ స్వామీజీనో, సన్యాసినో, మాతాజీనో లేదా ముల్లానో, ఫాదర్‌నో, ఏమత ప్రభోదకుడినైనా సరే, ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ఏ టి.వి తెరమీదో చూడండి. జాగ్రత్తగా గమనించండి. విషయం మీకే అర్థమవుతుంది. వాళ్లంతా తెల్లని వస్త్రాలు, లేదా కాషాయరంగు వస్త్రాలు ధరించి ఉంటారు. ఆ వస్త్రాలూ వాటిరంగూ సైన్స్‌వల్ల లభించినవి. వారి ముందు మైక్‌లుంటాయి. అవీ సైన్స్ వల్ల లభించినవే. విద్యుద్దీపాల కాంతి తెల్లగా, చల్లగా ప్రసరిస్తూ ఉంటుంది. ఏ.సీలు, కూలర్లూ ఉంటాయి. అవి అన్నీ సైన్స్ అందించినవే. సైన్స్ అందించిన ఇన్ని పరికరాల మధ్య కూర్చుని ఈ ఆధ్యాత్మిక గురువులు చెప్పేదేమిటీ? 'మానవ జన్మ వృథా! వెంటనే ఏదో ఓ శక్తిని, దేవుణ్ణి లేదా దేవతను నమ్మండి. మోక్షం సాధించండి' అని కదా? 'మోక్షమంటే ఏమిటి? ఎవరు పొందాడు దాన్ని? ఎవడు చూశాడు దాన్నీ? అనే ప్రశ్నలు ఎవరూ వేయకుండా గంభీరోపన్యాసాలు వన్‌వే ట్రాఫిక్‌లా సాగుతూ ఉంటాయి. మనిషి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అంశాలతో అతణ్ణి బలహీన పరచడం తప్ప, మనిషి మనిషిగా ఎదుగుతూ వచ్చిన విషయం ఏ ఒక్కటీ మాట్లాడరు. మనిషి తన మేధోసంపత్తి వల్ల సంపాదించిన విజ్ఞానంతో లబ్ధిపొందుతూ వాటి గూర్చి ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆత్మ, పునర్జన్మ, దైవం, భక్తి, ప్రార్థన వంటి మాటలతో మోసపూరితమైన ఉపన్యాసాలు అబద్ధపు ప్రవచనాలు చెబుతుంటారు. అందులో పిట్టకథలు మరో ఆకర్షణ! అందువల్ల విద్యావంతులను నేను కోరేదేమంటే మనిషి సాధించిన విజయాల గూర్చి జనానికి చెప్పండని! భవిష్యత్తులో ఇంకా రుగ్మతలు, మీ మానసిక బలహీనతలు సమాజంలో మీద రుద్దకండని. మనుషుల్ని బలహీనులుగా తయారు చేసే ఏ మత బోధకుడైనా అనారోగ్యానికి గురైతే ఏం చేస్తున్నాడూ? ప్రత్యేక నిపుణులైన డాక్టర్లతో వైద్యం చేయించుకుంటాడు కదా? తప్పదు. బయటికి వచ్చాక 'ఆ భగవంతుడి కరుణ వల్ల బతికి బయటపడ్డానని' చెప్పుకుంటూ ఉంటాడు. జనం దాన్ని నమ్ముతారు. డాక్టర్ల బృందం ఎంతో జాగ్రత్తగా చూసుకున్నదీ అందరూ కలిసి ఎంతో కష్టపడి మళ్లీ మామూలు మనిషిని చేశారన్నది మరుగున పడుతుంది. జరుగుతున్న ఘోరం ఇదే. ప్రతివాడూ సైన్స్‌ను ఉపయోగించుకుంటున్నాడు. కానీ, దాని గూర్చి కనీసం ఒక చిన్న మాట కూడా మాట్లాడడు. అంధవిశ్వాసాలలో బతకడం అలవాటు పడినవాడికి వాస్తవాలు రుచించవు. రుచికరమైన చిరుతిండికి అలవాటు పడ్డవాడు సాత్వికమైన పౌష్టికాహారం ఇష్టపడడు. అలాంటి వాళ్లకు అసలు వాస్తవాల్ని గ్రహిద్దామన్న స్పృహ కూడా ఉండదు. ఈరోజు బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్‌మాటిక్స్, జనటిక్ ఇంజనీరింగ్, హ్యూమన్ జీనోమ్, జీన్‌థెరపీ, క్లోనింగ్, సైన్స్ సెల్ రీసర్చ్, చంద్రయాన్ ప్రాజెక్ట్, నానో టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, ఫార్మాసుటికల్ రీసర్చ్, ఆర్టిఫీషియల్ ఇంటలజెన్స్, ఆర్టిఫీషియల్ లైఫ్ వంటి అనేక విషయాలపై పరిశోధనలు ఉధృతంగా జరుగుతున్నాయి. స్టెమ్‌సెల్స్‌పై జరిగే పరిశోధనలు అంటే మూలకణాలపై జరిగే పరిశోధనలు విజయవంతమైతే ఒక మనిషిని వారసత్వంగా వచ్చే వ్యాధులు, అతను పిండదశలో ఉన్నప్పుడే అంటే తల్లిగర్భంలో ఉన్నప్పుడే జన్యువుల్లోనే నివారించొచ్చు. విశ్వవిజ్ఞానం ఎంతగా పెరిగిపోయిందంటే విభిన్న రంగాలకు చెందిన

శాస్త్రవేత్తలందరూ మనస్ఫూర్తిగా తమతమ అహాల్ని వదులుకుని కృషి చేస్తే నూతన సృష్టిని రూపకల్పన చేయగలరు. అంతటి విజ్ఞానం మనకు ఉంది. అంతటి ప్రజ్ఞాపాటవాలు మన వాళ్లకు ఉన్నాయి. అయితే సమన్వయ లోపమే అవరోధంగా నిలుస్తోంది. 'ఎన్ని పరిశోధనలు జరిగినా కొత్తప్రాణికి మనిషి జీవం పోయగలడా? అనే సంశయానికి శాస్త్రవేత్తలు తప్పక సమాధానం చెప్పగలుగుతారు.

ఇటీవల ఒక కొత్త ఆవిష్కరణ వెలుగులోకి వచ్చింది. మైకోప్లాస్మా జెనిటాలియం (Mycoplasma Genitalium) అనే బాక్టీరియాలోని మొత్తం డిఎన్ఎ (DNA)ను ప్రయోగశాలలో కృత్రిమంగా సృష్టించగలిగారు. లోగడ వైరస్ డిఎన్ఎకు మాత్రం ఇంతవరకు రూపకల్పన చేయలేకపోయారు. అది ఇప్పుడు సాధ్యమయింది. వైరస్‌ల కన్నా బాక్టీరియాలలో ఇప్పుడు సృష్టించగలిగిన మైకోప్లాస్మా జెనిటాలియం కోసం సుమారు ఆరులక్షల డిఎన్ఎ బేస్ పెయిర్స్ తయారు చేయాల్సి వచ్చింది. అందువల్ల సహజంగానే మైకోప్లాస్మా జెనిటాలయంలో ఉండే డిఎన్ఎకు ప్రతిసృష్టి చేయడం జీవశాస్త్రంలో ఒక గొప్ప పరిణామం. మైకోప్లాస్మా జెనిటాలియం అనే ఈ బాక్టీరియా ప్రత్యుత్పత్తి అవయవాల్లో ఉంటుంది. సెక్స్ సమయంలో ఒకరి నుండి ఒకరికి ఇది వ్యాపిస్తుంది. అందువల్ల రాగాల కాలాలలో మానవుని జన్యువును కూడా శాస్త్రవేత్తలు రూపొందించగలరనే నమ్మకం కలుగుతూ ఉంది. సహజమైన బాక్టీరియాకు సరిసమానమైన బాక్టీరియాను రూపొందించగలిగినప్పుడు, సహజమైన మానవుడిని సరిసమానమైన మానవుణ్ణి శాస్త్రవేత్తలు రూపొందించగలరు. ఏదో ఆశాభావంతో ఇది ఊరికే అంటున్న మాట కాదు. నిజం కాబోయే వాస్తవం. ఇటీవల శాస్త్రజ్ఞులు ఒక మైక్రోబ్ (సూక్ష్మక్రిమి) నుండి డిఎన్ఎను మరో మైక్రోబ్‌లోకి మార్చారు. అంటే ఒక జీవిగా పుట్టబోయేదాన్ని, మరో జీవిగా మార్చి, పుట్టించినట్టు లెక్క. కృత్రిమంగా తయారు చేసిన క్రోమోజోమ్‌ను ఒక బాక్టీరియాలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా ఇప్పుడు ప్రారంభమైంది.

ఈ ప్రయత్నాలు విజయవంతమైతే ఒక కణం నుంచి జీవి పూర్తి రూపాన్ని తయారు చేయడానికి వీలవుతుంది. జీవులను, జీవలక్షణాలను మనిషే సృష్టించినట్లవుతుంది. అప్పుడు ఈ దేవుణ్ణి అంటే సృష్టికర్తని ఈ భక్తులంతా కలిసి ఎక్కడ దాచుకుంటారో తెలియదు. సైన్స్‌కు జీవంతో సంబంధం లేదని, జీవుల్ని ఏదో శక్తి సృష్టించిందని 19వ శతాబ్దం దాకా అందరూ నమ్మారు. 1828 నుండి టెస్ట్‌ట్యూబ్ ప్రయోగాలు ప్రారంభమైనప్పటి నుండి ఈ వాదన బలహీనపడుతూ వచ్చింది. ఇప్పటికీ అత్యధిక సంఖ్యాకులు జీవాన్ని దేవుడనే ఒక మానవాతీత శక్తి సృష్టించాడని నమ్మేవారే ఎక్కువ. కానీ, శాస్త్రపరిశోధనలు రానున్న కాలంలో వారి నమ్మకాల్ని, అభిప్రాయాల్ని తప్పక మారుస్తాయి. వాస్తవాల్ని జీర్ణించుకోవడానికి, తమ నమ్మకాల్ని వదులుకోవడానికి జనానికి కొంత సమయం పడుతుంది. ఎందుకంటే

త్వరతగతిన సాగుతున్న పరిశోధనల వల్ల శాస్త్రజ్ఞులు మానవుల జన్యువులను కూడా కృత్రిమంగా తయారుచేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనివల్ల మస్కులర్ డిస్ట్రోఫీ, సిస్టిక్ ఫైబ్రోసిస్ వంటి రోగాలకు చికిత్స సాధ్యమవుతుంది. అంతకన్నా మానవుడి ఆయుష్షు పెంచే ప్రయత్నం సఫలం అవుతుంది. ఈ విధంగా విజ్ఞానశాస్త్రం ఏఏ మూలలకు వ్యాపిస్తుందో, ఆయా మూలల నుండి దేవుడు మాయమవుతున్నాడు. ఒకనాడు 'స్మాల్‌పాక్స్ వస్తే అమ్మవారు అని భయపడ్డారు.

దాన్ని దైవానికి అంటగట్టారు. ఇప్పుడు అది వ్యాధి మాత్రమేనని తేలిపోయింది. దాని నివారణ కూడా జరిగింది. నమ్మకాలు, మూఢనమ్మకాలు బాగా ప్రబలుతున్న చోట దైవభావం బలంగా ఉంటుంది. విజ్ఞానశాస్త్రం ఒక జ్యోతిలా వెలుగులు అందిస్తున్న కొద్దీ, నమ్మకాల్లో మార్పు వస్తోంది. మూఢనమ్మకాలు సడలుతున్నాయి. అయితే ఎప్పటికప్పుడు కొత్తకొత్త మూఢనమ్మకాలు సమాజంలో చోటుచేసుకుంటున్నాయి. వాటిని తొలగించాల్సిన బాధ్యత విద్యావంతులైనవారిది, వివేకవంతులది. విశ్వవిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు జనానికి అందించే వారు మనకు ఎక్కువ సంఖ్యలో కావాలి. నిరక్షరాస్యుల కన్నా విద్యావంతులే కొంతమంది హేతుబద్ధంగా ఆలోచించక పోవడం, అంధవిశ్వాసాలలో తాము కొట్టుకుపోతూ తమ చుట్టూ ఉన్నవారిని సైతం భయపెడుతున్నారు. ఇలాంటి వారివల్ల మన సమాజం వైజ్ఞానిక సమాజంగా రూపాంతరం చెందలేక పోతూ ఉంది. ప్రతి ముందడుక్కీ ఎన్నెన్నో అవాంతరాలు వస్తూ ఉన్నందు వల్ల, అనుకున్నది సాధించడానికి సమయం పడుతోంది. ఉదాహరణకు ఎలుక, ఏనుగు, మనిషి గురించి ఆలోచిద్దాం. ఈ మూడూ క్షీరదాలకు చెందిన ప్రాణులు. అయినప్పటికీ పరిమాణంలో, జీవనంలో, ఆయుష్షులో తేడాలున్నాయి. జీవితకాలం అనేది ఆ ప్రాణికణాల ఆయుష్షుపై ఆధారపడి ఉంటుందని

(మిగతా 15వ పేజీలో)

అనుభవాల అంశాలే కవిత్వం



అధ్యాపక వృత్తి సాగిస్తోన్న కవి సుతారపు వెంకట నారాయణ తన కవిత్వసంపుటి 'మనసులిపి' ద్వారా మంచి నడవడిని మనతో పంచుకుంటున్నారు. పదపటాటోపం మాటల మాయాజాలం లేకుండా అందరికీ అర్థమయ్యే పదజాలంలో 56 కవితల్ని మనకంది స్తున్నారు. ప్రాచీనకతకు ప్రాధాన్య త ఇస్తూనే ఆధునికతకు స్వాగతం చెబుతున్నారు. కవి, కాంతి తన్మయత్వం కార్మికుడు, ఎన్నికలు, చెరువులు, పర్యావరణం, సెల్ బోనం ఏది వీరి సునిశిత దృష్టిని దాటిపోలేదు. ఇంతేకాదు గురజాడ, వట్టికోలు, కాళోజీ, కొండాలక్ష్మణ్, సి.నా.రెలాంటి ప్రముఖులను కూడా తన కవితా భూషణాలతో మెరిపించారు. వెంకట నారాయణ అనుసరించిన శైలిలో మరో ప్రత్యేకత గమనిస్తాం. పెద్దవారి గురించి చెప్పే ప్పుడు ప్రౌఢమైన పదాలు, ప్రగతి ప్రకృతి పర్యావరణం భీష్మప టలం ఇతిహాసహితం లాంటివి వాడి, పిల్లల వరకు వచ్చేసరికి చిట్టిపొట్టి మాటలు, ముద్దుముద్దు పాటలు, ఆటల లోకానికి తీసుకెళ్లతారు. నందినిసిధారెడ్డి తన ముందుమాటలో చెప్పినట్లు వీరి కవిత్వం 'జ్ఞానప్రదర్శన కోసం కాదు, జ్ఞానవిస్తరణ కోసం!' అమ్మంగి వేణుగోపాల్ అన్నట్లు 'వీరు మనతో సూటిగా, స్పష్టం గా, కవితాత్మకంగా' మనతో సంభాషిస్తారు. 'అమ్మ ఒక ఆమని/ అమ్మ ఆనందవీణ/ అమ్మ అనుభవాల చెమ్మ/ అమ్మ ఆశలపల్లికి' అంటూ మాతృమూర్తిని వర్ణించిన విధాయకం సుగుణ ప్రదామ కం. పల్లెను, పట్టణాన్ని సమంగా ప్రేమిస్తూ బతకమ్మను సెల్‌ఫోన్‌ను, సమభావనతో చూస్తూ రెంటి మంచి చెడ్డలను తూకం వేసి, విలువకట్టగల షరాబు వెంకట నారాయణ, మీకు అభినందనలు.

(మనసులిపి, కవిత్వం: రచన: సుతారపు వెంకట నారాయణ, వెల: రూ 60, ప్రతులకు: 12-11-367/6, వారాసిగూడ, హైదరాబాద్)

- కూర చిదంబరం

పుస్తక సమీక్ష

'పేజీ తిప్పి, మళ్లీ తరువాత పేజీ కూడా ఆసక్తికరంగా చూడాలనిపిస్తుంది. ఆ విధంగా మీరు అన్ని పేజీలు ఈ పుస్తకంలో చూస్తారు' అంటారు డాక్టర్ ఒ.ఎ.శర్మ. అత్యద్భుత చిత్రాలతో కన్నులపండుగగా 'కనువిందు' గ్రంథపతాక శీర్షికగా శర్మ రూపొందింపచేసిన ఈ సాహితీ చిత్ర ప్రక్రియ రచయిత ప్రతిభా విశేషసత్కృతికి అద్దంపడ్తోంది.

'కనువిందు' అపురూప చిత్రాలు

బహుముఖ ప్రజ్ఞాశాలి, వైద్యవిద్యా వేత్తగా 6 మహానిఘంటువుల సృష్టికర్త, సాహితీవేత్త ప్రొ॥ఒరుగంటి ఆంజనేయశర్మ, తొంభై వసంతాల పైబడిన వయోపరిపక్వతతో ఈ అపురూప చిత్రవ్యాఖ్యాన గ్రంథాన్ని రూపొందింపచేసారు. ఎన్నో సూక్తులు, హితోక్తులు, సుభాషితాలు, మనోరంజక చేసారు. సందేశాలు, భగత్సంబంధిత ఆశీస్సులు, వైద్యపరమైన సూచనలు, దేశవిదేశాల వార్తా సంఘటనలు, విచిత్రాలు, జాతీయ అంతర్జాతీయ ఘనతలు పోలికలు, భిన్నవిభిన్నాలు, లౌకికాలు, మహనీయ స్మృతులు ఫొటోలు, చిత్రాలను ఎంతో ప్రయాసతో సేకరించి రచయితగా వ్యాఖ్యానాలతో నయనానందకరంగా శర్మ ప్రచురింపచేసారు. 155 పేజీల వినూత్న గ్రంథం వయస్సుతో నిమిత్తం లేకుండా ఆబాలగోపాలాన్ని అలరింప చేస్తుంది. శర్మగారికి తెలుగు సాహితీలోకం కృతజ్ఞతలు అర్పించవలసినదే.

('కనువిందు' అపురూప చిత్రాల వ్యాఖ్యాన గ్రంథం, రచన: ప్రొ॥ఒ.ఎ.శర్మ, ప్రతులకు: నీల్‌కమల్ పబ్లికేషన్స్, సుల్తాన్‌బజార్, కోటి, హైదరాబాద్)

- యర్రమిల్లి

మాస్టర్ సి.వి.వి. మార్గంలో ప్రయాణించే మిత్రులు కూర్చిన ఆధ్యాత్మిక భావాల సంకలనం ఈ పుస్తకం. మహా గురువులైన ఆత్మజ్ఞానులు సాగించిన ఆధ్యాత్మిక అన్వేషణకి మార్గదర్శకులైన ఆత్మజ్ఞానులు ఎందరో వుంటుంటారు. ఈ పుస్తకంలో శ్రీకృష్ణ (క్రీ.పూ 3100), జొరాస్టర్ (క్రీ.పూ.1800), మహావీర (క్రీ.పూ.600) కన్ఫ్యూసియస్ (క్రీ.పూ.551), గౌతమబుద్ధ (క్రీ.శ.800) మాడంబ్లవట్‌స్కీ (క్రీ.శ 1875), మాస్టర్ సివివి (క్రీ.శ.1900) గురించి విపులంగా రాసారు. ఆరంభంలో అంతరిక్షం, ఆకాశం, ప్రపంచం, పరిణామం, భూమి,

ఆధ్యాత్మిక సాధనలోని 'మహారహస్యం'

సృష్టి, మానవుడు, జీవితం, మృత్యువు, అంతర్మథనం, తనని తాను తెలుసుకోవడం, మేధాశక్తి, విశ్వప్రేమ, ఆత్మస్పృహ, ఆవాహన లాంటి అంశాల వివరణ, విశ్లేషణ లోతైన పరిజ్ఞా న పూర్వక విలువైన సమాచారంతో ఈ పుస్తక రచన విలక్షణంగా ఉంది.



సైన్స్, పురాణాలు, చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. యోగులు ఆత్మస్థాయిలో ఉండి గురుస్థానంలో ఉండే వారుకాగా, పరమయోగులు ఆత్మకంటే ఉన్నతస్థాయి అంటే పరమాత్మ సమానులు. యోగులు సశరీరులుగా ఉంటూ కార్యనిర్వహణ చేస్తూ ఉంటే, పరమయోగులు అశరీరులుగా గురువుల పర్యవేక్షణ చేస్తూ వుంటారు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఇండియా, టిబెట్, రష్యా, చైనా, ఈజిప్ట్, ఇజ్రాయెల్, ఇరాన్, టర్కీ దేశాల్లోనూ పరమయోగులు అవతరించినట్లు గమనించవచ్చు (పేజీ.45) అంటారు. 5000 వేల సంవత్సరాల నుండి ఇప్పటివరకూ గల మహాగురువుల సాధన, శోధన, యోగ వైశిష్ట్యతలపై లోతైన విశ్లేషణలు, ఫొటోలు, జనన మరణరహస్యాలు, అమరత్వసాధన అనే అంశాల గురించి చక్కగా రాసారు. 10వ అధ్యాయంలో మాస్టర్ సివివి (04-08-1868-12-05-1922) మదర్ సి.వి. గురించి (23-09-1894-16- 7-1961) రాసిన వ్యాసం ఈ పుస్తకానికి ఎంతో పరిపూర్ణతను తెచ్చింది. ప్రచురణకర్తలైన పొంగులేటి గీత, సుధాకర్‌రెడ్డిలు అభినందనీయులు.

(మహారహస్యం, రచన, సంకలనం: మాస్టర్ గార్డెన్ ఫ్రెండ్స్, వెల: 250, ప్రతులకు: మాస్టర్ బుక్ హౌస్, అరవిందనగర్ కాలనీ, దోమల్‌గూడ, హైదరాబాద్)

– తంగిరాల చక్రవర్తి

ఈవారం కవిత్వం

కనుల గదుల్లో...

ప్రియతమా!
నీ ఆలోచనలతోనే
మొదలవుతుంది ప్రతీ ఉదయం
నీ రూపమే నిండి ఉంటుంది
ఆ రోజంతా మనసంతా
రాత్రి కంటిరెప్పలు నిద్రలోకి వాలేవరకు
వేల సార్లు నువ్వే గుర్తొస్తావు.
నిద్ర పట్టినాక కూడా నీ తలపులు నన్ను
వదలవంటే నువ్వు నమ్మవు.
కలలో కూడా నా కళ్లలో కదలాడుతూ
నా గుండెలో కొత్త కొత్త లయలు
మోగిస్తావు.
ఎలా చెప్పను నీకు
ఇలలో నువ్వే, కలలోనూ నువ్వే

గుండె గదుల్లో నువ్వే.
ఇంతగా నన్ను నువ్వు
పరవశింపచేస్తుంటే
నిన్నెలా మరువగలను!
ఎలా ప్రేమించకుండా ఉండగలను?
ఇదేనేమో అందమైన కమ్మనైన ప్రేమంటే!
మరి నీకూ!?

- నాగముని. యం

'కలిమిడి'తోనే 'కులాస'

నలుగురితో కలిసి ఉండు
కలవకుండా వుంటే ఒంటరి అవుతావు
ఒంటరితనంతో ఆందోళన ఆవరించి
కుంగుబాటుతో నీ జీవితం
కుదేలౌతుంది.
కన్నీరైనా పన్నీరైనా పది మందితో
పంచుకుంటే మనసుకు స్వాంతన
కలిసి వుంటే కలదు సుఖం.
బాధలు షేరింగ్ బాధ్యతల కేరింగ్

ఒత్తిడి పరారై హుషారు ఉల్లాసం
ఖరారై మనోల్లాసం వికసిస్తుంది
కలయికతోనే నీ జీవితం
సామాజిక జీవితమే నీ జీవన సాఫల్యతకు మార్గం
కలిసి జీవించు కల్మశాలను తుంచు
కరుణ దయ కర్తవ్యాన్ని పెంచు
నీవు వేరుగా ఉంటున్నావంటే
నీ కళ్లు, చెవులతో పాటు
నీ ఒంటరి ఆలోచనలు
మానసిక ఆందోళనలకు ఆజ్యం పోస్తాయి
నీ జీవితం నీ ఆధీనంలో లేనట్లే
అలాంటి దుస్థితిలో ఉన్న నీవు
నీతో కలవలేని వారిని
నిందించడం అవివేకం.
కలిమిడితత్వం, పలకరింపు
సమన్వయం, సహనం, సంఘీభావం
సేవాభావం, ఆదరణ, ఆత్మీయత
పరోపకారం ప్రగతిశీలత
నీ జీవనశైలి అవుతే
నీ జీవితం ఆనంద బృందావనమై
నిత్య సంతోష సంబరాల సందడితో
తరించాలి
ఆదరణ ఆత్మీయతకు నీవే అంబాసిడర్ కావాలి
పరుల హితమే నీ అభిమతమైతే
నీ సమాజ సేవలు చిరస్మరణీయమై
ఆదర్శనీయమైన జీవన శైలితో
నూతన చరిత్రను సృష్టించాలి.

- నేదునూరి కనకయ్య

నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ

(12వ పేజీ తరువాయి)

శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ప్రకృతి వైద్యం చేసే వైద్యులు కూడా ఆ మాటే చెబుతున్నారు. కణాల ఆయుష్షునే వయసు (Ageing) అని అంటున్నారు. ఈ కణాల ఆయుష్షు మళ్లీ ఆ ప్రాణి తీసుకునే ఆక్సిజన్‌పై ఆధారపడి ఉంటుంది. శ్వాసక్రియకు సంబంధించిన వ్యాయామం మంచిదని చెప్పేది అందుకే. మనం పీల్చే ఆమ్లజని వల్ల కణాలకు శక్తి లభిస్తుంది. ఆ ప్రక్రియ జరుగుతున్నప్పుడు కొన్ని ప్రమాదకరమైన ఉప ఉత్పన్నాలు కూడా విడుదల అవుతాయి. వాటినే 'ఫ్రీరాడికల్స్' అంటున్నాం. ఈ ఫ్రీ రాడికల్స్ కేన్సర్ వంటి వ్యాధుల్ని కలుగజేస్తాయి. అలాంటి వ్యాధులు రాకుండా ఫ్రీరాడికల్స్‌ని నియంత్రించడానికి 'ఎంజైమ్స్' అవసరమవుతాయి. ఎంజైమ్స్ ఏ మోతాదులో కావాలో ఆ మోతాదులో మనం వాటిని అదుపు చేయగలిగితే వ్యాధులపై, ఆయుష్షుపై మనం పట్టు సాధించవచ్చు. ఆ దిశలో పరిశీలనలు, పరిశోధనలు నిరాఘాటంగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఒక కొత్త విషయం బయటపడింది. మన రెండు తెలుగు రాష్ట్రాలలోని వైశ్యజాతిలో కొన్ని ఎంజైమ్‌ల లోపం బయటపడింది. అనాదిగా కుటుంబాలలోనే పెళ్లిళ్లు చేసుకుంటూ రావడం వల్ల, అది వంశపారంపర్యంగా వచ్చిన లోపమా? లేక మరేవైనా ఇతర కారణాలున్నాయా? తేలాల్సి ఉంది. అంటే ఇంకా ఇతర కులాల్లో జాతుల్లో కూడా ఏవేవో కొన్నికొన్ని లోపాలు ఉండవచ్చు కదా? వాటిని కూడా ఇప్పుడు సైన్సు పరిశోధనలు వెలికి తీయాల్సి ఉంది. ఇక్కడ మనం మరొక ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోవాలి. జీవనగతిని మలుపు తిప్పే ఆవిష్కరణలు చేయడం ఏ కొద్దిమంది శాస్త్రవేత్తలకో సాధ్యమయ్యింది. భవిష్యత్తులో కూడా సాధ్యమవుతుంది. అంతే కాని, మిలియన్ల సంఖ్యలో ఉన్న సామాన్య జనం నమ్మకాల వల్ల సమాజంలో ఏ ఆవిష్కరణలూ జరగడం లేదు. వారి నమ్మకాలు బలంగానే ఉండొచ్చు కాదనలేం. కానీ వాటికి వైజ్ఞానిక శాస్త్ర ఆధారాలు లేవు. అందువల్ల అవి నిలబడవు. అజ్ఞానం వల్ల, అమాయకత్వం వల్ల సామాన్యుల్లో ఏవో కొన్ని నమ్మకాలు ఏర్పడుతూ ఉంటాయి. ఎందుకు ఎలా ఏర్పడుతూ ఉంటాయి? అంటే మతాధిపతులు చెప్పే అందమైన అబద్ధాల వల్ల ఏర్పడుతూ ఉంటాయి. జనంలో ఏర్పడ్డ విశ్వాసాలు సడలిపోకుండా ఒకవైపు మతాధిపతులు, మరొకవైపు రాజకీయ నాయకులు తీవ్రంగా కృషి చేస్తుంటారు. బలహీనతల మీదనే వ్యాపారాలు జరుగుతాయని వారికి బాగా తెలుసు. తమతమ వృత్తులతో వ్యాపారం చేసుకునే సినీనటులు, రాజకీయ నాయకులు, క్రికెటర్ల మొదలైన వారిని పక్కనపెట్టి నిస్వార్థంగా, సమాజ పురోగతికి పాటుపడే శాస్త్రవేత్తల్ని, సంస్కరణవాదుల్ని, దార్శనికుల్ని, అధ్యాపకుల్ని గౌరవించుకున్ననాడు సమాజం బాగుపడుతుంది. వ్యవసాయ దారుడు, కూలీ, ఉద్యోగి, కార్మికుడు వంటి వారి శ్రమకు సరైన విలువ లభించినప్పుడు సమాజం విలువ పెరుగుతుంది. సమాజంలో సగభాగమైన మహిళలకు తగిన గౌరవం లభించిననాడు ఆ విలువ ప్రస్ఫుటమవుతుంది. అందుకు వైజ్ఞానిక అవగాహన చాలా అవసరం. వైజ్ఞానిక దృక్పథం పెంచుకున్న సమూహాలు, సమాజాలు, ఆరోగ్యంగా ముందుకుపోతాయి. సూర్యుని చుట్టూ భూమి తిరుగుతూ ఉందంటే, అర్థం చేసుకోలేని మూర్ఖులు తలలు నరికేశారు. క్లాసులో పరిణామ సిద్ధాంతం చెప్పినందుకు 1925లో జాన్ టి.స్కోప్స్ అనే ఉపాధ్యాయుణ్ణి టెన్నిస్సి రాష్ట్రం అమెరికాలో అరెస్టు చేశారు. ఒక ఐరిష్ మత పెద్ద ఈ చరాచర జగత్తంతా బి.సి.ఇ. 4004లో అక్టోబరు 23 ఉదయం తొమ్మిది గంటలకు ఆ భగవంతుడే సృష్టించబడిందని చెప్పాడు. అప్పటి నుండి ఇప్పటి దాకా శతాబ్దాలు గడిచినా దానికి రుజువే లేదు. ఆ మత పెద్దగానీ, అతని అనుచర గణంగానీ ఊహాజనితమైన ఆ ప్రకటనని వాస్తవంగా మలచలేకపోయారు. నైలునది బురదలోంచి మొసళ్లు ఉద్భవించాయని ఈజిప్టులోని పురాతన సంచాల జాతులు నమ్మేవి. ఆవుపేడలోంచి తేళ్లు పుడతాయని కూడా నమ్మేవి. ఆ నమ్మకాలు ఏవీ నిలబడలేదు. నమ్మకాలుగా అవి చాలా కాలం కొనసాగాయి. అంతమాత్రం చేత అవి నిజాలు కాలేదు. డార్విన్ పరిణామ సిద్ధాంతం, హట్టన్ భూమి పొరల సిద్ధాంతం, లైసెమెన్ జన్యుప్రయోగాలు, హెకెల్ బయోజనటిక్‌లా వంటివి ఎన్నో ప్రతిపాదించబడ్డాయి. ఆయా సిద్ధాంతాలు వాస్తవాలుగా నిరూపించబడుతూ వెలుగులోకి వస్తున్న కొద్దీ అతకు ముందున్న నమ్మకాలన్నీ మరుగున పడసాగాయి. కొత్త నిజాలు సమాజానికి కొత్త సమాచారం అందిస్తూ వచ్చాయి. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. నిరంతరం కొనసాగుతుంది కూడా!

నిజానికి మనమిప్పుడు చాలా ముందుకు వచ్చాం. కొన్నికొన్ని విషయాల్లో విశ్వాసాల వల్ల మళ్లీ చాలా వెనక్కి వెళ్లిపోతున్నాం. దానికి అడ్డుకట్ట వేసుకుంటూ ఉండాలి! తప్పదు!! వైజ్ఞానిక పరిశోధనలకు సంబంధించి ఏవీ అందుబాటులో లేని రోజుల్లో సి.వి.రామన్ ఈ దేశంలో పరిశోధనలు చేసి నోబెల్ బహుమతి సాధించారు. స్వాతంత్ర్యానంతరం క్రమంగా దేశం అభివృద్ధి

చెందుతూ వచ్చింది. ఈ దేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నేతృత్వంలో 96-97 శాతం వైజ్ఞానిక పరిశోధనాశాలలన్నీ రూపుదిద్దుకున్నాయి. 'సైంటిఫిక్ టెంపర్' అనే పదాన్ని ప్రపంచానికి అందించింది కూడా ఆయనే! వైజ్ఞానిక స్పృహతో మాత్రమే ఈ దేశం ప్రగతి పథంలోకి పొగలదని చెప్పిన దార్శనికుడాయన! క్రమంగా ప్రపంచస్థాయి వైజ్ఞానిక పరిశోధనా శాలలు మనదేశంలో కూడా ఏర్పాటయ్యాయి. చంద్రయాన్ విజయవంతమైంది. అది అందించే సమాచారం భారతీయ సమాజానికే కాక, మొత్తం ప్రపంచానికే ఎంతో ఉపయోగపడుతోంది. విచారించ వల్సిన విషయమేమంటే పరిశోధనా శాలలకు విడుదల చేయాల్సిన వార్షిక నిధులు కూడా నేటి కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఇది ఈ దేశప్రజలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అతి ముఖ్యమైన విషయం. ■

కథ

చిత్రంలో సందేశం

భువనగిరి రాజ్యాన్ని గుణశేఖరుడు పరిపాలిస్తుండేవాడు. అతని మంత్రి సుబుద్ధి. రాజ్యంలో ఏటా జరిగే పండుగ వేడుకలలో జరిగే పలురకాల పోటీలు నిర్వహించబడతాయి. విజేతలకు ప్రోత్సాహ బహుమతులు రాజుగారి చేతులమీదుగా ఇవ్వబడతాయి. ఆ యేడు జరిగిన చిత్రలేఖనం పోటీలలో రెండు చిత్రాలలో ఒకదానిని ఉత్తమచిత్రంగా ఎంపిక చేసే బాధ్యత మంత్రి సుబుద్ధికి అప్పగించాడు రాజు గుణశేఖరుడు.

రెండు చిత్రాలను పరిశీలించిన మంత్రి సుబుద్ధి 'ప్రథమ సంప్రదాయ నృత్యం చేస్తున్న యువతిని కడురమ్యంగా చిత్రికరించాడు చిత్రకారుడు. ఈ చిత్రం సమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇవ్వలేకపోయింది. మరో చిత్రాన్ని పరిశీలిద్దాం. ఈ చిత్ర రెండు భాగాలుగా చిత్రికరించబడింది. మొదటిభాగంలో ఒక బలమైన వ్యక్తి కొండపై నుండి పెద్ద బండను కిందికి దొర్లిస్తున్నాడు. అదే చిత్రంలోని మరో భాగంలో, అదేబండను ఎందరో బలాఢ్యులు కలసి కిందకు వచ్చిన ఆ బండను తిరిగి కొండపైకి ఎక్కించలేకపోతున్నారు. ఈ చిత్రంలో అద్భుతమైన సందేశం ఇమిడి ఉంది. ఎన్నో సంవత్సరాలు కష్టించి నేర్చినవిద్య, సత్ ప్రవర్తన, సమాజపరంగా తనకు ఉన్న మన్నన, మర్యాదలు ఒక్క తప్పుతో కొండపై నుండి దొర్లిన రాయిలా మారిపోతుందని కాని మరలా తిరిగి ఉన్నత శిఖరాలు అధిరోహించడం గత జీవితాన్ని తిరిగి పొందడం అసంభవం అని ఈ చిత్రం తెలియజేస్తుంది. సృజనాత్మక సందేశాన్ని ప్రజలకు అందించగలిగిన ఈ రెండో చిత్రమే ఉత్తమ చిత్రం' అన్నాడు. అక్కడ ఉన్న ప్రజలంతా మంత్రి ఎంపికకు హర్షధ్వానాలు చేసారు.

'భళామంత్రివర్యా! మీ ఎంపిక హర్షించదగినదే. సంప్రదాయకళల గురించి, ఆచార, వ్యవహారాల విషయాలలో ప్రజలకు మనం చెప్పవలసింది ఏమి ఉండదు. ఏకథ అయినా, ఏకవిత్వమైనా సందేశాత్మకం కాకుంటే అది నిరర్థకమే. కవులు, గాయకులు, చిత్రకారులు మొదలగువారంతా అజ్ఞాన అంధకారంలో ఉన్న ప్రజానీకానికి కరదీపికలుగా ఉండాలి. అప్పుడే వారి ఆశయం నెరవేరి ప్రజలకు మేలు జరుగుతుంది' అన్నాడు రాజు గుణశేఖరుడు.

- డా॥ బెల్లంకొండ నాగేశ్వరరావు, చెన్నై

రంగులు వేయండి



పసుల వార్తలమ్మ
వార్త ఆదివారం

బాలగేయం

ఇవన్నీ చేస్తాం

ఆదివారం
ఆటలాడుకుందాం
సోమవారం
చదువుల గుడికెళదాం
మంగళవారం
మంచి పనులు చేద్దాం
బుధవారం
బుద్ధుని బోధనలు విందాం
గురువారం
గురువులనే చూద్దాం
శుక్రవారం
శుభము శుభమునే
పలుకుదాం
శనివారం
శెనగలే తిందాం

- గుండాల నరేంద్ర బాబు
తిరుపతి

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

- ఎస్.గీతాళి, శ్రీకాకుళం

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వృక్షాల ఆయుష్షు ఎంతకాలం గరిష్టంగా ఉంటుంది?

జవాబు: గీతాళి! కొన్ని రకాల వృక్షాలు కొన్ని వందల సంవత్సరాలు బతుకుతాయి. అంతకంటే విశేషమైన సంగతి ఏమిటంటే కొన్ని రకాల చెట్ల పొదలు కొన్ని వేల సంవత్సరాలు జీవిస్తాయి. ఎన్ని వేల సంవత్సరాలు అంటే దాదాపు పన్నెండు వేల సంవత్సరాలకు పైగా బతుకుతాయని తెలియవచ్చింది. వీటిని 'క్రేసోట్ బుషెస్' అంటారు. పరిసరాలలో వేలాది సంవత్సరాలలో వచ్చే మార్పులకు అవి మూగ సాక్షాలన్నమాట.

- ఎన్. శ్రీనివాస్, వరంగల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కొండలు, మంచుకొండలు ఒకటేనా? తేడాలున్నాయా?

జవాబు: శ్రీనివాస్! కొండల మీద బాగా మంచు కురిసి దట్టంగా ఏర్పడితే ఆ కొండలను మంచుకొండలని అంటారు. మంచుకొండల మీద చాలా మందంగా మంచు ఏర్పడినా కొంత కాలానికి కరిగిపోయి మామూలు కొండలుగానే మిగిలిపోతాయి. సముద్రాలలో ఏర్పడే మంచుకొండలు కూడా ఉంటాయి. వీటిని 'ఐస్‌బర్గ్'అని అంటారు. సముద్రాలలోని నీరు సాధారణంగా వేడిగానే(నునువెచ్చగా) ఉంటాయిగానీ, కొన్ని చోట్ల వాతావరణ ప్రభావంతో బాగా శీతలంగా నీరు వుండి గడ్డ కడుతుంది. ఈ రకంగా ఏర్పడిన గడ్డలన్నీ కలిసి పెద్ద ఆకారంలో 'ఐస్‌బర్గ్'గా రూపొందుతాయి. వీటిని తాకితే పెద్ద పెద్ద ఓడలు(టైటానిక్ తరహాలో) కూడా బద్దలైపోతాయి. మంచుపర్వతాల సాంద్రత తక్కువగా వుంటే సముద్రపు జలాల ఉపరితలానికి కనిపిస్తాయి. నీటి సాంద్రత కంటే ఎక్కువగా వీటి సాంద్రత ఉన్నట్లయితే సముద్ర ఉపరితలానికి చేరవు, మనకు కన్పించవు. మామూలు కొండల మీద మంచు కురిసి మంచుకొండలుగా కనిపించే వాటికి ఉదాహరణగా సిమ్లా కొండలను చెప్పుకోవచ్చు. ఇవి శీతాకాలంలోనే ఏర్పడతాయి.

మరింత క్షేమం!

ఒడిలో ల్యాప్‌టాప్, చేతిలో మొబైల్ ఫోన్, బల్లమీద డెస్క్‌టాప్, గోడకు స్మార్ట్ టీవీ. ప్రస్తుతం ఇళ్లన్నీ ఇలాంటి డిజిటల్ పరికరాలతోనే శోభిల్లుతున్నాయి. వై-ఫై నెట్‌వర్క్‌తో వీటిని వాడుకోవటం పరిపాటిగానూ మారింది. వైర్‌లెస్‌తో అనుసంధానమయ్యే డిజిటల్ పరికరాల వినియోగం చాలా వేగంగా పెరిగిపోతోంది. ఈ క్రమంలో హోం నెట్‌వర్క్ భద్రతకూ ప్రాధాన్యం

ఏర్పడింది. అలాగని వై-ఫై నెట్‌వర్క్ భద్రతను కాపాడుకోవటానికి టెక్ నైపుణ్యం సాధించాల్సిన పనేమీ లేదు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే చాలు.

డిఫాల్ట్ నేమ్, పాస్‌వర్డ్ మార్చుకోవటం

ముందుగా చేయాల్సింది డిఫాల్ట్ నేమ్ (ఎస్ఎస్ఐడీ), పాస్‌వర్డ్ మార్చుకోవటం. వైర్‌లెస్ రూటర్ల కంపెనీలు డిఫాల్ట్‌గా ఎస్ఎస్ఐడీ సదుపాయాన్ని కల్పిస్తాయి. చాలావరకు ఇది కంపెనీ పేరు అయ్యుంటుంది. వైర్‌లెస్ కనెక్టడ్ పరికరాలు చుట్టుపక్కల వై-ఫై నెట్‌వర్క్‌లను వెతికేటప్పుడుప్రతీ నెట్‌వర్క్‌ను ఎస్ఎస్ఐడీ జాబితా రూపంలోనే చూపిస్తాయి. హ్యాకర్లు మన నెట్‌వర్క్‌లో చొరబడటానికి అవకాశం కల్పించొచ్చు. కాబట్టి వ్యక్తిగత వివరాలు అవతలివారికి తెలియకుండా ఉండేందుకు ఎస్ఎస్ఐడీని మార్చుకోవటం మంచిది. ఇందుకోసం కంప్యూటర్ లేదా మొబైల్‌ఫోన్‌లో వెబ్ బ్రౌజర్‌ను ఓపెన్ చేసి అడ్రస్ బార్‌లో రూటర్ ఐపీ అడ్రస్‌ను టైప్ చేసి, ఎంటర్ చేయాలి. మెనూలో వైర్‌లెస్ ఆప్షన్‌లోకి వెళ్తే వైర్‌లెస్ నెట్‌వర్క్ నేమ్‌లో డిఫాల్ట్ ఐడీ నేమ్ కనిపిస్తుంది. దీన్ని మార్చుకొని, సేవ్ చేసుకోవాలి.

డిఫాల్ట్‌గా వచ్చే పాస్‌వర్డ్‌నూ

మార్చుకోవాలి. ఎందుకంటే ఇలాంటి పాస్‌వర్డ్‌లను హ్యాకర్లు తేలికగా గుర్తిస్తారు. రూటర్ కంపెనీ తెలిస్తే ఇది మరింత తేలికవుతుంది. కాబట్టి కొత్త పాస్‌వర్డ్‌ను సెట్ చేసుకోవాలి. కనీసం 20 అక్షరాలు గల పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలి. ఇందులో అక్షరాలు, అంకెలు, చిహ్నాల వంటివన్నీ ఉండేలా చూసుకోవాలి.

ఇంట్లో లేనప్పుడు ఆఫ్

బయటకు ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోతే రూటర్‌ను ఆఫ్ చేసేయాలి. ఇది మనశ్శాంతినీ కలిగిస్తుంది.

వేర్వేరు ప్రాంతాల్లో వైర్‌లెస్ నెట్‌వర్క్‌ను వాడుకోవటానికి రిమోట్ యాక్సెస్ ఉపయోగపడినప్పటికీ కొన్నిసార్లు భద్రతకు ముప్పు ఏర్పడొచ్చు. కాబట్టి అవసరమైతే రిమోట్ యాక్సెస్‌ను డిసేబుల్ చేసుకోవాలి. దీంతో హోం నెట్‌వర్క్ మీద హ్యాకర్లు దాడి చేయకుండా జాగ్రత్త పడొచ్చు.

నెట్‌వర్క్ ఎన్‌క్రిప్షన్ ఎనేబుల్

దాదాపు అన్ని వైర్‌లెస్ రూటర్లు ఎన్‌క్రిప్షన్ ఫీచర్‌ను కలిగుంటాయి. అయితే చాలా రూటర్లలో ఇది డిఫాల్ట్‌గా ఆఫ్ అయ్యుంటుంది. దీన్ని ఆన్ చేసుకుంటే షేర్ చేసుకున్న డేటా ఎన్‌క్రిప్ట్ అవుతుంది. ఇలా నెట్‌వర్క్ భద్రతను కాపాడుకోవచ్చు. రూటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తక్షణమే ఎన్‌క్రిప్షన్‌ను ఎనేబుల్ చేసుకోవటం మంచిది. ఇందుకోసం ఐపీ చిరునామాతో రూటర్ అడ్మినిస్ట్రేటర్ కన్సోల్‌కు లాగిన్ అవ్వాలి. వైర్‌లెస్ నెట్‌వర్క్ లేదా వైర్‌లెస్ సెక్యూరిటీ విభాగంలోకి వెళ్లాలి. ఇందులో ఎన్‌క్రిప్షన్ ఆప్షన్‌ను మార్చుకోవాలి.

ప్రస్తుతం చాలా ఎన్‌క్రిప్షన్ రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో సమర్థంగా పనిచేసేవి డబ్ల్యూపీఏ2, డబ్ల్యూపీఏ3.

అప్పటికే ఎన్‌క్రిప్షన్ ఫీచర్‌ను రూటర్ వాడుకుంటుంటే దాన్ని తెలుసుకోవటమెలా? ఫోన్ లేదా ట్యాబ్లెట్‌తో దీన్ని చూడొచ్చు. పరికరం సెట్టింగ్స్‌ను ఓపెన్ చేయాలి. నెట్‌వర్క్ విభాగం పక్కన ప్యాడ్‌లాక్ గుర్తు ఉన్నట్లయితే ప్రాథమిక సెక్యూరిటీ ఎనేబుల్ అయినట్టే. ఇక్కడే ఎన్‌క్రిప్షన్ రకాన్నీ చూడొచ్చు.

యాక్సెస్ పరిమితం

ఇంట్లో వై-ఫైని షేర్ చేసుకోవటం మంచిదే. కానీ తెలియనివారికి యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ ఇస్తేనే చిక్కులు. ఇంట్లో మరమ్మత్తులు చేసేవారికో, రంగులు వేసేవారికో ఇవ్వటం తగదు. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే ఇంటి వై-ఫై కనెక్షన్ ఇవ్వటం కన్నా గెస్ట్ వై-ఫై నెట్‌వర్క్‌ని సెట్ చేసుకోవాలి. దీంతో ఇంటర్నెట్‌ను మాత్రమే షేర్ చేసుకోవచ్చు. షేర్డ్ ఫోల్డర్లు, ప్రింటర్లు, స్టోరేజీ పరికరాలు, ప్రధాన వైర్‌లెస్ నెట్‌వర్క్‌తో అనుసంధానమైన పరికరాలు ఇతరుల కంట పడకుండా కాపాడుకోవచ్చు.

ఫైర్‌వాల్ రక్షణ

మాల్వేర్, వైరస్‌ల వంటివి కంప్యూటర్‌లో జొరపడకుండా ఫైర్‌వాల్ నిరోధిస్తుంది. సాధారణంగా వైర్‌లెస్ రూటర్లలో ఇన్‌బిల్ట్‌గా ఫైర్‌వాల్ రక్షణ ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఇది ఆఫ్ అయ్యుండొచ్చు. అందువల్ల రూటర్ ఫైర్‌వాల్‌ను ఆన్ చేసుకోవాలి. ఇందుకోసం ఐపీ అడ్రస్‌తో లాగిన్ అయ్యి, రూటర్ సెటింగ్స్‌లోకి వెళ్లాలి. ఇందులో అడ్వాన్స్‌డ్ సెట్టింగ్ విభాగంలో ఫైర్‌వాల్ బాక్స్‌ను ఆన్ చేసుకోవాలి. దీంతో నెట్‌వర్క్‌లోకి ఇతరులు రావటం, పోవటాన్ని నివారించొచ్చు. ఒకవేళ రూటర్‌లో ఫైర్‌వాల్ లేనట్లయితే కంప్యూటర్‌లో మంచి ఫైర్‌వాల్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లేకపోతే వైర్‌లెసన నెట్‌వర్క్ మీద హ్యాకర్లు దాడి చేసే ప్రమాదముంది.

సాఫ్ట్‌వేర్ అప్ టు డేట్

ఇతర సాఫ్ట్‌వేర్ మాదిరిగానే కొన్నిసార్లు రూటర్ ఫర్మ్‌వేర్‌లో లోపాలు తలెత్తొచ్చు. రూటర్ కంపెనీ ఫర్మ్‌వేర్‌ను వెంటనే విడుదల చేసి, సరిదిద్దకపోతే

ఇది పెద్ద చిక్కులకు దారితీయొచ్చు. కాబట్టి రూటర్‌ను అందుబాటులో ఉన్న తాజా సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. తాజా సెక్యూరిటీ ప్యాచెస్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీంతో హ్యాకర్లు మన వై-ఫై నెట్‌వర్క్‌లోకి చొరపడటం తప్పుతుంది.

నెట్‌వర్క్‌కు వీపీఎన్ యాక్సెస్

వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) రహస్య, ఎన్‌క్రిప్ట్ మార్గాన్ని సృష్టిస్తుంది. వై-ఫై కనెక్షన్ల ద్వారా పరికరం నుంచి వెళ్లిన, అందిన సమాచారాన్ని ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. ఇలా చదవలేని, పట్టుకోలేని పద్ధతిలోకి మార్చేస్తుంది. అందువల్ల ఆన్‌లైన్‌లో ప్రసారమైన డేటా సురక్షితంగా, భద్రంగా ఉంటుంది. పీసీ, మ్యాక్, మొబైల్ ఫోన్ల వంటి పరికరాల్లో వీపీఎన్‌లను వాడుకోవచ్చు. నోర్టన్ సెక్యూర్ వీపీఎన్ వంటివి చాలానే అందుబాటులో ఉన్నాయి.

వాట్సప్ వీడియో కాల్ షేరింగ్

ఎప్పటికప్పుడు వినూత్న ఫీచర్లతో అలరించే వాట్సప్ మరిన్ని కొత్త సదుపాయాలు అందుబాటులోకి తేనుంది. తాజాగా వీడియో కాలింగ్ అనుభూతిని ఇనుమడింప చేయటంపై దృష్టి సారించింది. వాట్సప్ కొత్త మార్పులపై నిశితంగా దృష్టి సారించే వాబీటాఇన్ఫో వెబ్‌సైట్ ప్రకారం వీడియోకాల్ చేస్తుండగానే తేలికగా స్క్రీన్‌ను షేర్‌చేసుకునే ఫీచర్ రానుందిప. ప్రస్తుతం దీన్ని ఆండ్రాయిడ్ బీటా టెస్టర్లకు అందుబాటులో ఉంచారు. వాట్సప్ బీటా 2.23.11.19 ఆనరడాయిడ్ వర్షన్ గలవారు దీన్ని పరీక్షించుకోవచ్చు. వీడియోకాల్ చేస్తున్నప్పుడు కాల్‌కంట్రోల్ వ్యూలో కొత్తగుర్తు కనిపిస్తుంది. ఇది స్క్రీన్ షేసేరింగ్‌కు వీలు కల్పిస్తుంది. దీన్ని ఎంచుకుంటే తెరమీద కనిపించే దృశ్యాలు రికార్డు అవుతాయి. అవి అవతలివారికి ప్రసారమవుతాయి. ఒకవేళ మధనయలో ఎక్కడైనా ఆపాలనుకుంటే పాజ్ చేసుకోవచ్చు. అయితే దృశ్యాలను షేర్ చేయడానికి అనుమతి ఇచ్చినవారికే ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. ఆండ్రాయిడ్ 2.23.11.19 వర్షన్‌కు అప్‌డేట్ చేసుకున్నాక నావిగేషన్ బార్‌లో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే చాలు.

మౌజ్ కట్స్

కంప్యూటర్‌ను ఎంతకాలం నుంచి ఉపయోగిస్తున్నప్పటికీ కొత్త షార్ట్‌కట్ గురించి తెలిస్తే బోలెడు సంతోషమేస్తుంది. మౌజ్ షార్ట్‌కట్స్ అలాంటివే. 80ల వరకూ మౌజ్‌ను పెద్దగా వాడేవారు కాదు. ఇప్పుడు మౌజ్ లేని డెస్క్‌టాప్‌ను ఊహించడమే కష్టం. కీబోర్డు మాదిరిగానే దీని వాడకంలోనూ కొన్ని షార్ట్‌కట్స్ ఉన్నాయి. ఇవి వర్డ్ ప్రాసెసర్లు, ఈమెయిల్, సోషల్ మీడియా.. ఇలా అన్నిచోట్లా పనికొస్తాయి. ❑

కథ

మాయాజాలం

మాలా కుమార్

శ్రీరాం ఆఫీసుకు వెళ్లాక బాల్కనీలో కూర్చొని పేపర్ చదువుతూ ఒక్కో చుక్కా తాగుతూ కాఫీని ఆస్వాదిస్తోంది కీర్తన. ఇంతలో సెల్ మోగింది. తీసి “హాయ్ రాధీ! పనైపోయిందా? పొద్దున్నే ఫోన్ చేసావు?” అంది.

“అమ్మా, నేను మల్లమ్మను. రాధికమ్మ కోసం కాఫీ తీసుకొని వెళితే అమ్మ బాత్‌రూంలో పడిపోయి ఉన్నారు. పాపలు కాలేజ్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరు. అందుకని మీకు ఫోన్ చేసాను” అంది మల్లమ్మ గాభరాగా.

“అయ్యో, ఇప్పుడే వస్తున్నాను” అంటూనే కార్ కీస్ తీసుకొని, తలుపుకు తాళం వేస్తూ శ్రీరాంకు ఫోన్ చేసి “రాం, రాధి బాత్‌రూంలో స్పృహ తప్పి పడిపోయిందిట. మల్లమ్మ కాల్ చేసింది. నేను వెళుతున్నాను” అని చెప్పింది.

“అయ్యో, ఏమైందో! విక్రం హాస్పిటల్‌కు తీసుకెళ్లు. ఏదైనా ఎమర్జెన్సీ అవుతే కాల్ చేయి. నేనూ వస్తాను” అన్నాడు.

రాధికను పరీక్ష చేసి డాక్టర్ విక్రం చెప్పిన మాటలకు కీర్తన తెల్లబోయి చూసింది.

“మీరు చెప్తోంది నిజమేనా విక్రం! తను ఇద్దరు టీనేజ్ ఆడపిల్లల తల్లి. నాకు తెలిసినంతవరకూ ఆమె భర్త అర్జున్ చాలా మంచివాడు. పెద్ద కంపెనీలో మంచి పొజిషన్లో ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు లేవు. తన లైఫ్‌లో ఎలాంటి ఒత్తిళ్లు, ఆరళ్లు లేవు. అలాంటప్పుడు దానికి ఇలా చేయవలసిన అవసరం ఏం ఉంటుంది?”

“చూడు కీర్తనా! నువ్వు మా శ్రీరామ్ భార్యవి, ఈమె ప్రాణస్నేహితురాలివి కనుక నీకు పేషెంట్ పరిస్థితిని గురించి వివరంగా చెప్పాను. ఆమె కుటుంబ పరిస్థితులు ఏంటో కానీ ఆమె కచ్చితంగా డ్రగ్స్‌కి అలవాటు పడుతోందని మాత్రం చెప్పగలను. ఈ విషయం ఆమె భర్తకు ఇన్ఫామ్ చేసారా?” అడిగాడు డాక్టర్ విక్రమ్.

“ఫోన్ కలవట్లేదు, మెసేజ్ పెట్టాను” అంది.

“సరే! ఆమెకు మెలకువ వచ్చేటప్పటికి అటెండెంట్ ఎవరో ఒకరు ఆమెతో ఉండేలా చూసుకో.

అసలే తీవ్రమైన డిప్రెషన్‌లో ఉందామె. నేను మధ్యాహ్నం మళ్లీ వస్తాను” చెప్పి వెళ్లిపోయాడు విక్రమ్.

ఆందోళనను అణచుకోవడానికి ప్రయత్నిస్తూ రాధిక మంచం పక్కనున్న కుర్చీలో కూర్చుంది.

రాధిక, కీర్తన చదువుకునే రోజుల్నించీ మంచి స్నేహితురాళ్లు. కీర్తనకు డిగ్రీ అవుతుండగానే పెళ్లయిపోవటంతో ఆమె పిల్లలు కీర్తన పిల్లల కంటే పెద్దవాళ్లు.

ఆమె భర్త శ్రీరామ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. కీర్తన కూడా ఒక ప్రైవేట్ కంపెనీలో ఇంజినీర్‌గా చేస్తోంది.

కీర్తన కూతురికి పెళ్లయింది. నాలుగు నెలల క్రితం కూతురి డెలివరీ కోసం, ఆఫీసులో లాంగ్ లీవ్ తీసుకొని ఆస్ట్రేలియా వెళ్లి వారం క్రితమే వచ్చింది కీర్తన. ఇంకా డ్యూటీలో చేరలేదు. తరచూ స్నేహితురాల్లిద్దరూ ఫోన్‌లో సంభాషిస్తూ, ఒకరితో ఒకరు తమ వ్యక్తిగత విషయాలు పంచుకుంటూనే ఉంటారు. ఇద్దరి మధ్య రహస్యాలేం ఉండవు.

“తను ఆస్ట్రేలియాలో ఉన్న ఆ నాలుగు నెలల్లో రాధిక ఇంట్లో ఏమైనా జరిగిందా? అయినా తనెక్కడున్నా కూడా అప్పుడప్పుడు తనూ, రాధిక ఫోన్లో మాట్లాడుకుంటూనే ఉన్నారు కదా! ఒకవేళ నేను కూతురినీ, పాపాయినీ చూసుకునే హడావుడిలో ఉంటానని నాతో ఫ్రీగా ఏదైనా పంచుకోలేకపోయిందా రాధీ! అయినా ఓ పద్ధతైన సాధారణ ఇల్లాలు అసలిలా డ్రగ్స్‌కు ఎలా అలవాటు పడింది?” ఆలోచిస్తుంటే బుర్ర వేడెక్కింది కీర్తనకు. మనసు మనసులో లేదామెకు.

“డాడీ ఊ...ఊ...”

ఆలోచనలో ఉన్న కీర్తన, రాధిక మూలుగుతో ఉలిక్కిపడింది.

“రాధీ....రాధీ...” చేత్తో చిన్నగా తట్టుతూ పిలిచింది కీర్తన.

మత్తుగా కళ్లు తెరిచి కాసేపు అయోమయంగా చూస్తూ “కీర్తూ, నువ్విక్కడున్నావేమిటే? అసలు నేనెక్కడున్నాను?” అడిగింది.

"మధ్యాహ్నం నువ్వు బాత్రూంలో పడిపోయావని మీ మల్లమ్మ గాభరాగా ఫోన్ చేస్తే మీ ఇంటికి వచ్చి, నిన్ను శ్రీరాం ఫ్రెండ్ హాస్పిటల్‌లో చేర్చాను" చెప్పింది కీర్తన.

"ఓ..." అని ఆలోచనలో పడిపోయింది రాధిక.

కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

"అర్జున్ ఊళ్లో లేరా? ఎప్పుడొస్తారు?" అడిగింది కీర్తన.

"ఢిల్లీలో కాన్ఫరెన్స్ ఉందని వెళ్లారు. సాయంకాలం వచ్చేస్తారు. కీర్తూ, నాకిప్పుడు బాగానే ఉంది. ఇంటికి పోదాం, డాక్టర్ గారిని అడుగుదామా?" అంటూ చిన్నగా లేచి వెనుకకి ఆనుకొని కూర్చుంది రాధిక.

"వెళ్లవచ్చు, కానీ నీ ఈ పరిస్థితికి కారణం చెపితేగానీ వెళ్లనీయరు. అంతేకాదు, పోలీస్ కేస్ కూడా అవుతుందేమో!" నిశితంగా రాధికను చూస్తూ అంది కీర్తన.

"పోలీస్ కేసా?" బిత్తరపోయింది రాధిక.

"అవును. నువ్వు డ్రగ్స్ తీసుకున్నావని అన్నారు డాక్టర్ విక్రమ్. అది పెద్ద కేసే కదా! అసలు నీకు ఈ డ్రగ్స్ ఎట్లా అలవాటయ్యాయి? ఎక్కడ దొరికాయి? తెలిసి తీసుకున్నావా? తెలియక తీసుకున్నావా? ఇవన్నీ తెలవాలి వాళ్లకు. పోలీస్‌కు ఇన్ఫాం చేస్తామన్నారు. కానీ నువ్వు లేచాక తెలుసుకొని చెబుదామని ఆగారు. నువ్వు రెస్టు తీసుకో. కాస్త తేరుకున్నాక చెబుదువుగానీ" బత్తాయిరసం ఇస్తూ జవాబిచ్చింది కీర్తన.



కళ్లు కిందికి దించుకొని మౌనంగా రసం తాగుతున్న రాధిక వైపు చూస్తూ "రాధీ, మీ మమ్మీ డాడీలను మర్చిపోలేకపోతున్నావా? నువ్వు ఆ తరువాత ఎప్పుడూ మాట్లాడకపోతే సద్దుకుపోతున్నావనుకున్నాను" రాధిక చేయి పట్టుకొని, మెత్తగా అంది కీర్తన.

ఒక్కసారిగా రాధిక కళ్ల నుంచి నీళ్లు జలజలా రాలిపోయాయి. "ఎట్లా మర్చిపోతాను కీర్తూ? నీకు తెలుసు కదా నేను ఒక్కదానినే కూతురునని, మమ్మీ డాడీతో నాకు అటాచ్‌మెంట్ ఎక్కువని. మిమ్మల్ని చూడాలని ఉంది వెంటనే రండి అని నేను హఠం చేస్తే వస్తున్న వాళ్లకు కార్‌కు ట్రక్ ఆక్సిడెంట్ జరిగి ఇద్దరూ అప్పటికప్పుడే మరణించటమూ, వాళ్లకోసమని లంచ్ తయారు చేసి ఎదురు చూస్తున్నదాన్ని వాళ్లను ఆ విధంగా చూడటం ఎంత షాక్! నేను రమ్మని గొడవ చేయకపోతే వాళ్లు అప్పుడు వచ్చేవారు కాదు కదా!" భోరున ఏడవసాగింది రాధిక.

గబుక్కున రాధిక తలను తన పొట్టకానించుకొని నిమురుతూ "ఆక్సిడెంట్ జరిగిన రెండు నెలలకే నేను ఆస్ట్రేలియా వెళ్లాల్సి వచ్చింది. నువ్వు కూడా ఆంటీ అంకుల్ గురించి మాట్లాడటమూ, ఏడవటమూ తగ్గించావు. కొద్దికొద్దిగా అలవాటు పడుతున్నావనుకున్నాను కానీ ఇంత బాధపడుతున్నావనుకోలేదు. నేనూ మా అమ్మాయి, పాప సంరక్షణలో పడి నిన్ను అంతగా పట్టించుకోలేదేమో! సారీ రాధీ, వెరీ వెరీ సారీ. అయినా రాధీ నీ బాధా నా దగ్గర దాయాలా? ఇదేనా మన స్నేహానికి అర్థం? పంచుకొని తగ్గించుకునే బదులు డ్రగ్స్‌కు అలవాటు పడ్డావా? అసలు అవి నీకు ఎట్లా అలవాటయ్యాయి?" బాధగా, అనునయంగా అంది కీర్తన.

రాధిక చిన్నగా "ఎట్లా చెప్పమంటావు? మనవరాలు పుట్టిన సంతోషంలో, హడావిడిలో ఉన్న నీకు రోజూ చెప్పి ఏడవటం నాకు ఇష్టం లేకపోయింది. అప్పటికీ నాతో క్లోజ్‌గా ఉండే మా కిట్టీ ఫ్రెండ్స్ రూపా, శైలజా వచ్చి నన్ను బలవంతాన సినిమాలకు, కిట్టీ పార్టీకి తీసుకెళ్లేవారు. వాళ్లకు చెపుదామన్నా ఎన్ని రోజులు ఇట్లా ఏడుస్తావు? ఎవరి సమస్యలు వాళ్లకు ఉన్నాయి అని విసుక్కుంటారేమోనని, చులకనవుతానని ఎవరికీ చెప్పేదానిని కాదు.

కీర్తూ... రోజూ పొద్దున్నే పిల్లలిద్దరూ కాలేజ్‌కు వెళ్లగానే కాఫీ తాగుతూ డాడీకి ఫోన్ చేసేదానిని. నేనూ డాడీ ఎన్ని కబుర్లు చెప్పుకునేవారమో! నాకు ఏదైనా సమస్య రాగానే డాడీతోనే చర్చించేదానిని. అమ్మ "నువ్వు డాడీ కూతురువే!" అని ఉడుక్కునేది. అమ్ములూ నీ కోసం టమాటా పచ్చడి చేసానురా, నువ్వు వస్తావా, నేను రానీ అని మమ్మీ అడిగితే– టమాటాపచ్చడి కోసం జూబిలీహిల్స్ నుంచి సికిందరాబాద్ వెళ్తావా? అని అర్జున్ ఏడిపించేవాడు. ఒకటా రెండు ఎన్నని చెప్పను? ఆ జ్ఞాపకాలను, వారి ప్రేమను ఆ ముద్దుమురిపాలను ఎట్లా మర్చిపోను?" చేతులతో మొహం కప్పుకొని ఏడవసాగింది రాధిక.

రాధిక పక్కన కూర్చుని వీపు మీద సున్నితంగా రాయసాగింది కీర్తన.

కీర్తన ఇచ్చిన మంచినీళ్లు తాగి, కాస్త తమాయించుకొని "మా కిట్టీలో శకుంతల అని కొత్తావిడ చేరిందని చెప్పాను, గుర్తుందా కీర్తూ?"

గుర్తుందన్నట్లు తలాడించింది కీర్తన. అర్జున్ పని చేసే కంపెనీలోని కొంతమంది ఆఫీసర్ల భార్యలు కలిసి ప్రతి నెలా కిట్టీపార్టీ చేసుకుంటారు.

ఆ నెలలో పుట్టినరోజు, పెళ్లిరోజు ఉన్నవాళ్లతో కేక్ కట్ చేయిస్తారు. కాసేపు ఆటపాటలతో గడిపి, ఏదైనా అనాథాశ్రమంలో అన్నదానం చేస్తారు. ఆ రోజు కిట్టీలో వచ్చిన డబ్బుతో అవసరమున్నవారికి సహాయం చేస్తారు. తనకు అంతగా ఆసక్తి లేనందున ఆ గ్రూప్‌లో కీర్తన చేరలేదు.

"ఓ..." అని ఆలోచనలో పడిపోయింది రాధిక. కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. "అర్జున్ ఊళ్లో లేరా? ఎప్పుడొస్తారు?" అడిగింది కీర్తన.

కానీ వాళ్ల విశేషాలన్నీ రాధిక చెపుతూ ఉంటుంది. అదంతా గుర్తు తెచ్చుకొని "అవును చెప్పావు, ఆవిడ చాలా ఆక్టివ్ అనీ, మీ కార్యక్రమాలు అన్నింటిలోనూ చాలా చురుకుగా పాల్గొంటుందని కూడా చెప్పావు. అయితే?" అడిగింది.

"నువ్వు ఆస్ట్రేలియా వెళ్లాక నాకు ఇంకా చాలా ఒంటరితనమనిపించింది. కిట్టీపార్టీకి కూడా వెళ్లాలనిపించేది కాదు.

ఆ నెల రూప వచ్చి "ఎంతసేపని ఇట్లా కూర్చుంటావు?" అని పార్టీకి తీసుకెళ్లింది.

ఆ పార్టీలో శకుంతల "మీరు ఏమిటి? ఇంతలా చిక్కిపోయారు? చాలా డల్‌గా అయ్యారు. జరిగింది విషాదమే కానీ మీరు దానిలో నుంచి బయటకు రావాలి. వంటరిగా ఉండకండి. నలుగురితో కలవండి" అని పార్టీ తరువాత వాళ్ల ఇంటికి తీసుకెళ్లింది. మీరు చాలా నీరసంగా ఉన్నారు. ఈ ఎనర్జీ డ్రింక్ తీసుకోండి అని ఒక జ్యూస్ ఇచ్చింది. అది తాగాక ఆ రోజు రాత్రి చాలా రోజుల తరువాత హాయిగా నిద్రపోయాను. మనసు తేలికైన భావన కలిగింది.

అది మళ్లీ కావాలనిపించి మరునాడు శకుంతలకు ఫోన్ చేసాను. తను తెచ్చి ఇచ్చింది. బయట కొనుక్కుంటానంటే అది బయట దొరకదని, చాలా కాస్ట్లీ అని, కావాలంటే తనే తెచ్చిస్తానని తెచ్చి ఇచ్చేది. కొద్ది రోజుల తరువాత అది డ్రగ్స్ ఏమోనని నాకు అనుమానం వచ్చి ఆ రోజు తాగలేదు. కానీ శరీరం, మనసు నా మాట వినలేదు. చాలా తిక్కతిక్కగా అనిపించి శకుంతలకు ఫోన్ చేసి ఆ డ్రింక్ కావాలని అడిగాను. ప్రతిసారీ తను చాలా డబ్బులు వసూలు చేసేది. నా ఎకౌంట్‌లో ఉన్నవన్నీ కరిగిపోయాయి. అర్జున్ గమనించి అడిగితే ఏమి చెప్పాలా? అనీ, అట్లాని మానుకోలేక సతమతం అయ్యేదానిని.

"నీ దగ్గర మనీ లేకపోతే మా కంపెనీకి మోడల్‌గా చేయి" అని అడిగింది శకుంతల. దాంతో తర్జన భర్జనలు పడి ఆ జ్యూస్ తాగకుండా ఉండలేక ఈరోజు తను రమ్మన్న సమయానికి పిల్లలిద్దరు కాలేజీకి వెళ్లగానే వాళ్ల ఇంటికి వెళ్లాను.

అక్కడ నాకు మేకప్ చేస్తాడని, కెమెరామన్ అని ఇద్దరిని పరిచయం చేసింది. వాళ్లను చూడగానే నాకు చాలా భయం వేసింది. ఇక్కడ డ్రాయింగ్ రూంలో వద్దు, బెడ్ రూంలోకి వెళ్దాం" అని శకుంతల అనగానే ఎందుకో నా మనసు జలదరించింది. మళ్లీ వస్తాను అని వెనక నుంచి శకుంతల పిలుస్తున్నా వెనకకుండా ఇంటికి వచ్చేస్తాను.

అదసలు మామూలు మోడలింగ్ కాదేమో, పైగా బెడ్ రూంలో అంటోంది. అదేమి షూటింగో ఏమో, ఎంత ప్రమాదం నుండి బయట పడ్డాను అని ఇంటికి వచ్చాక కూడా ఆలోచిస్తుంటే కాళ్లు గజ గజా వణికిపోయాయి. నా తలలో హోరు మొదలయింది. వళ్లంతా వణికిపోతోంది. తిక్కతిక్కగా ఉంది. వెంటనే ఆ ఎనర్జీ డ్రింక్ కావాలి. లేకపోతే తట్టుకోలేను అని హైరానా పడిపోతున్నాను. ఎన్నాళ్లు ఇలాగా? ఆ షూటింగ్ జరిగివుంటే? ఆ పాడు డ్రింక్ కోసం ఎంత దిగజారిపోయేదానిని.. తలచుకుంటేనే నా మీద నాకే అసహ్యం వేస్తోంది. ఇట్లా బతకటం దండగ అనుకొని, ఆఫీస్ పనివత్తిడి తట్టుకోలేక ఎప్పుడైనా వేసుకోవటానికి అర్జున్ నిద్రమాత్రలు తెచ్చుకున్నాడు. అందులో నుంచి ఒకటొకటిగా తీసుకొని వేసుకుంటుంటే పిల్లలు అమ్మా! అని పిల్లలు పిలిచినట్లుగా అనిపించింది. చేతిలోకి తీసుకున్న టాబ్లెట్‌ను అలా చూస్తూ ఇంత పెద్దదానిని నేను మా అమ్మా నాన్నల మరణం తట్టుకోలేక డిప్రెషన్‌లోకి పోయి డ్రగ్ ఎడిక్ట్‌గా మారుతున్నాను. ఇక నేను లేకుండా నా కూతుళ్లు ఎట్లా ఉండగలరు? ఇప్పుడిప్పుడే లోకాన్ని చూస్తున్నారు. కష్టమైన టీనేజ్‌లోకి వచ్చారు.

వాళ్లు ఏ ప్రలోభాలకూ లొంగకుండా జీవితంలో నిలదొక్కుకునే వంకూ కనిపెట్టి ఉండాల్సిన బాధ్యత నాదే కదా! నా తల్లిదండ్రులు నన్ను ఎంత గారాబంగా చూసుకున్నారో.. నేనూ వాళ్లను చూసుకోవాలి కదా! ఎంత పొరపాటు చేయబోయాను. భగవంతుని దయవలన అంతగా ఎడిక్ట్ కాలేదు. ప్రయత్నం చేస్తే పోతుంది. ఏదైనా రిహాబిలేషన్ సెంటర్‌లో చేరి నా అలవాటును పోగొట్టుకోవాలి. నేను చావకూడదు అనుకొని అప్పటికే నాలుగు మాత్రలు లోపలికి పోవటంతో మత్తుగా మూసుకుపోతున్న కళ్లను బలవంతంగా తెరుచుకుంటూ టాబ్లెట్స్ వాంతి చేసుకుందామని బాత్రూంలోకి వెళ్లాను. అంతే! ఇప్పుడు ఇక్కడ నిన్ను చూస్తున్నాను" ధారాపాతంగా కారుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ చెప్పింది రాధిక.

"బాధపడకు రాధీ. నీ తప్పు నువ్వు తెలుసుకున్నావు. ఇప్పుడు మునిగిపోయిందేమీ లేదు. మంచి ట్రీట్‌మెంట్ తీసుకుందువుగానీ. ఈ విషయాలన్నీ అర్జున్‌కు, శ్రీరాంకు, డాక్టర్ విక్రమ్‌కు చెబుదాం" అని కీర్తన అంటుండగానే డాక్టర్ విక్రమ్, శ్రీరాం అప్పుడే ఢిల్లీ నుంచి వచ్చి, విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన అర్జున్ లోపలికి వచ్చారు.

అర్జున్ రాధిక పక్కన కూర్చొని చేయి పట్టుకొని ఆప్యాయంగా "నన్ను క్షమించు రాధీ, ఆంటీ, ఆంకుల్ మరణం నిన్ను బాధిస్తుందని తెలిసినా నువ్వు మామూలుగా తిరుగుతుంటే కోలుకుంటున్నావనుకొని నిన్ను అంతగా పట్టించుకోలేదు. ఇకనుంచి నిన్ను వదలను. ఈ డాక్టర్ చెప్పినట్లుగా మందులు వేసుకొని, వ్యాయామాలు చేస్తుంటే త్వరగా కోలుకుంటావు. పిల్లల సెలవుల్లో అందరమూ కలిసి హాయిగా ఏదైనా టూర్ వెళ్దాం. ఇక ఆ శకుంతల సంగతి మా ఫ్రెండ్ డిఐజీకి చెపుతాను. ఆయన చూసుకుంటాడు" అన్నాడు.

పిల్లలతో ప్రేమయాత్ర.. ఎంజాయ్ సెకండ్ హనీమూన్ అని అందరూ థంబ్స్ అప్ చూపిస్తే సిగ్గుతో అర్జున్ వెనుక మొహం దాచుకుంది రాధిక.

నాకు తెలిసిన ఓ మిత్రుడు ఉన్నాడు.

అతను ఓ ఆఫీసులో పని చేస్తున్నాడు. అతనేమీ పెద్ద ఉద్యోగస్తుడు కాడు. కానీ ఎప్పుడడిగినా బిజీ అంటాడు. కొంపలంటుకుపోయే పనేమీ కాకున్నాసరే బిజీగా ఉన్నట్లు చూపించుకుంటాడు.

అతని స్వభావం అలాంటిది.

ఎప్పుడూ బిజీనే!

"సార్, మిమ్మల్ని చూసెళ్దామని వచ్చాను" అని చెప్పడం తరువాయి. వెంటనే–

"కాస్తంత ఉండండి.." అని చెప్పడమే కాకుండా పక్కనున్న ఫైళ్లన్నింటినీ అటూ ఇటూ హడావుడిగా తిప్పుతుంటాడు.

అది చూసేవారికి ఏమనిపిస్తుందంటే అతనేదో అర్జంటు పనిలో ఉన్నట్టే అనిపిస్తుంది. ఫైలు తీస్తాడు, పక్కన పెట్టేస్తాడు. ఇంకొక ఫైలు తీస్తాడు, వేగంగా అటూ ఇటూ తిప్పుతాడు. అతనేదో పనిఒత్తిడిలో ఉన్నాడా? అని అనిపించేంత భ్రమ కల్పిస్తాడు. అయితే అదంతా నటనే. ఓ పదిహేను నిమిషాల తర్వాత ఆ... చెప్పండి ఏమిటి సంగతులు? అన్నట్టు క్షణం చూసినట్టే చూసి మళ్లీ చూపులన్నీ ఫైళ్ల మీదకు మళ్లిస్తాడు. కానీ అక్కడ ఏమీ ఉండదు.

ఇంతలో పొరపాటున బయటి నుంచి ఫోన్‌కాల్ వచ్చిందనుకోండి.. ఫోన్ తీస్తాడు. కానీ వెంటనే హలో చెప్పడు. కాస్సేపు పక్కన పెట్టి ఆ తర్వాత మాట్లాడుతాడు.

అలా తానేదో బిజీగా ఉన్నట్టు అవతలివారికి ఫీల్ కల్పిస్తాడు.

ఇలాంటి వారిని మనం ఎక్కడో అక్కడ చూస్తూ ఉంటాం.

బిజీగా ఉన్నట్లు నటించడం ఉంది చూసారూ.. ఈ అలవాటు ఇలాగే కొనసాగిందంటే తర్వాత్తర్వాత అదొక మానసిక జబ్బులా కూడా మారే అవకాశం ఉందని మానసిక నిపుణులు చెప్తున్నారు. అటువంటివారు నటిస్తున్నారని తెలిస్తే వారి గురించి హేళనగా మాటలు కూడా అనేవారుంటారు. వారి గురించి జోకులు వేస్తారు.

అలా నటించేవారిని మానసిక తత్వవేత్తలు ఏమంటున్నారంటే..

ఇటువంటివారు తాము కోరుకున్న పనులు పొందలేకపోవడంతో పాటు తగిన హోదా దక్కకపోవడంతో తమ ఈగోని కాపాడుకోవడానికి ఇలా నటిస్తారట.

మనిషి మనసు ఇటువంటి సందర్భాలలో ఏదైనా కొన్ని కారణాలను కల్పించుకుని రాజీ పడొచ్చు. కానీ అలా చేయరు. పరీక్షల్లో పాసవని విద్యార్థులు మాస్టార్లను తప్పు పడుతుంటారు చూడండి... ఆ తంతు కూడా ఇలాంటిదే.

దీనిని నిపుణులు డిఫెన్స్ మెకానిజం అని అంటున్నారు. అంటే తనను తాను రక్షించుకోవడానికి దాచుకోవడానికి ప్రవర్తించే తీరు.

ఒకరికి తన పదవిలో తగిన గుర్తింపు లభించలేదంటే అటువంటివారు ఇలా ఏదో ఒకటి చేస్త బిజీగా ఉన్నట్టు నటిస్తారట. అలా నటిస్తూ తృప్తి పడతారట.

ఇటువంటివారు మానసిక వైద్యుల వద్దకు వెళ్లి విషయాన్ని చెప్పి ఆరంభంలోనే తమ తీరుని సరిచేసుకోవడం మంచిది. లేకుంటే పోను పోను లేనిపోని కష్టాలు తలెత్తుతాయి.

ఇకమీద ఎవరైనా మీ దగ్గర "నేను ఇరవై నాలుగు గంటలూ బిజీ" అని చెప్పినా లేక ఎప్పుడూ బిజీగా ఉన్నట్టు నటిస్తే వారిని ఒక కంట కనిపెట్టండి.

సరే, ఈ స్థితిని తప్పించడం ఎలా?

ఒకరిని ఏ కుర్చీ(పదవిలో)లో కూర్చోపెట్టినా ఆ కుర్చీకి తగినట్టు తనను మార్చుకోగలగాలి. పని నేర్చుకోవాలి. పదవికి తగినట్లు ప్రవర్తించడం తెలియాలి. తెలియకుంటే తెలుసుకోవాలి. అంతేతప్ప నటించడం అనేది సరికాదు.

ఓ రోజు ఉదయం పది గంటలైంది.

ఎప్పుడూ బిజీగా ఉన్నట్టు చెప్పుకునే ఒక ఆఫీసరు ఆఫీసు నుంచి అత్యవసరంగా బయటకు వస్తున్నారు. "ఏమిటి సార్, ఇలా అర్జంటుగా పోతున్నారు. ఇది అందరూ ఆఫీసుకి వచ్చే టైము. కానీ మీరేమో బయటకు వెళ్తున్నారు?" అని అడిగితే–

"రోజూ వస్తూ వస్తూ తెచ్చుకునే ఓ ముఖ్యమైనదానిని ఇంట్లోనే పెట్టేసి వచ్చాను. అందుకే అత్యవసరంగా వెళ్తున్నాను" అంటాడాయన.

"దానికెందుకిలా పరుగులు తీయడం? మీ స్కూటర్లో వెళ్లొచ్చుగా!" అన్నామనుకోండి..

"నేను ఇంట్లో విడిచిపెట్టి వచ్చిందే ఆ స్కూటర్ని. దాన్ని తీసుకురావడానికి పరుగెడుతున్నాను" అని వేగంగా పోతూ అదృశ్యమవుతాడు.

- యామిజాల జగదీశ్

తాపీ ధర్మారావు-తెలుగు భాషా వికాసం

తెలుగు సాహిత్యంలో ఎక్కువగా పద్యకావ్యాలే వెలువడిన కారణంగా ప్రజలు మాట్లాడుకొనే భాషకీ, పుస్తకాల భాషకీనాడు మధ్య పెద్ద అఖాతం ఏర్పడింది. వాడుక భాషకు, గ్రంథాలలోని భాషకు ఆ రోజులలో తెలుగులో ఉన్నంత తేడా ఏ ఇతర భాషలో లేదు. తెలుగులో వచన భాషా వికాసానికి, ఆంగ్ల విద్యాశాఖాధికారి జె.ఏ.యేట్స్ నాంది పలికారు.

1910 ప్రాంతంలో పాఠశాలలను యేట్స్ పర్యవేక్షిస్తూ, ఇంగ్లీష్ కంటే బాలబాలికలకు తెలుగు బోధించటం కష్టంగా వుండటం గ్రహించాడు. ఆనాడు దక్షిణాదికి ఒకే విశ్వవిద్యాలయం వుండేది. మదరాసు విశ్వవిద్యాలయం ఈ సమస్య పరిష్కరించడానికి ప్రతి భాషకు ఒక కమిటీ నియమించింది. తెలుగు కమిటీలో గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి సభ్యులు. అయినా అధిక సంఖ్యలో సభ్యులు వ్యావహారిక వాదాన్ని వ్యతిరేకించారు. 700 సంవత్సరాలు కాల వ్యవహారంలో ఉన్న సాంప్రదాయిక తెలుగు ఆ సందర్భంలో వెలుగులోకి వచ్చింది.

వ్యవహారిక భాషా ఉద్యమ సారథిగా 1919 సెప్టెంబరులో గిడుగు వేంకట రామమూర్తి 'తెలుగు' మాసపత్రికలో తెలుగుభాష నాగరికంగా, భాషా ప్రయోజనాలను సాధించే ప్రణాళికలు, నాటి పత్రికా రంగం వ్యవహారిక భాషోద్యమానికి సారథ్యం వహించే ముమ్ముందు తరానికి మార్గదర్శకం చేసారు.

కవిగా, విమర్శకునిగా, పత్రికా రచయితగా, పరిశోధకునిగా తెలుగు పత్రికల ద్వారా వ్యవహార భాషను ప్రజాపరం చేసిన సాహితీవేత్తలలో తాపీధర్మారావు ప్రముఖులు. 1905 ప్రాంతంలో ఎఫ్.ఎ.చదువు కోసం పర్లాకిమిడి కళాశాల విద్యార్థిగా, ధర్మారావు, గిడుగువారి శిష్యుడు. భారతీయ సాహిత్య నిర్మాతగా, జీవద్భాషగా తెలుగును వ్యవహారిక భాషగా రూపొందింపచేయడానికి అవిశ్రాంతంగా పోరాడిన భాషాసేనాని గిడుగువారి ప్రియశిష్యునిగా, రచయిత తాపీ ధర్మారావు ఆయన జీవితాదర్శాన్ని, పత్రికా రంగంలో, చలన చిత్ర రంగంలో తెలుగును సుప్రతిష్ఠం చేసారు.

'గిడుగు' వారి తుది విన్నపాన్ని, 1940 జనవరి 15న మద్రాస్‌లోని ప్రజామిత్ర కార్యాలయంలో ఆయన కట్టకడపటి సందేశంగా తెలుగు పత్రికల సంపాదకులు స్వీకరించి సామాన్య జన సామాన్యపు నోళ్లల్లో క్రమేపీ నాట్యమాడే మధురమైన భాషగా, తెలుగుజాతిని జాగృతం చేసారు. తాపీధర్మారావు, ఎన్.జి.ఆచార్య, నార్ల వెంకటేశ్వరరావు, కొడవటిగంటి కుటుంబరావు నాటి పత్రికా సంపాదక మేధావులు, రచయితల దీక్షా దక్షతల కారణంగా వ్యవహారిక పత్రికా భాషగా తెలుగు సుసంపన్నమైంది.

1897 సెప్టెంబరు 19న గంజాం ప్రాంతం బరంపురంలో జన్మించిన తాపీ ధర్మారావు అభ్యుదయ సంస్కరణవాదిగా తెలుగు సాహితీ రంగానికి అద్వితీయ సేవలు అందించారు. తొలి రోజుల గ్రాంథిక భాషాభిమానాన్ని వదులుకొని క్రమేపీ పత్రికా రంగంలో 1936లో దినపత్రిక జనవాణి ప్రారంభించారు.

తాతాజీ పేరిట సుపరితులైన ధర్మారావు పత్రికా రంగం, సినీ రంగాలలో తెలుగు వెలుగులు ప్రసరింపచేసారు. 1937లో 'మోహినీ రుక్మాంగద' సినిమాతో రంగప్రవేశం చేసారు. తెలుగు రచనలు, పుస్తకాలు, పత్రికలలోని తెలుగు, 'తాపీ' వంటి వ్యవహారిక భాషావేత్తల కృషి ఫలితంగా చలనచిత్ర రంగంలో అడుగు పెట్టింది. తొలి సినిమాల నిర్మాత, రచయిత గూడవల్లి రామబ్రహ్మంతో తాపీ ధర్మారావు 'మాలపిల్ల', 'దాసి', 'రైతుబిడ్డ'లకు పనిచేసారు. శ్రీశ్రీ, కొడవటిగంటి, ఆరుద్ర, కె.బి.తిలక్, వంటి వివిధ రంగాల రచయితలకు సినీ రంగంతోను, సాహితీ వ్యాసంగం కలిసి వుండేది. తొలి రోజులలో అక్షర శారదా ప్రశంస రచనకు ధర్మారావుకు 'ఆంధ్ర విశారద'గా గౌరవం లభించింది.

తాపీ ధర్మారావు రచయితగా సంచలనాత్మక సాహిత్యం సృష్టించారు. 'కొత్త పాళీ, పాత పాళీ', 'రాయిరప్పలు', 'దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు?' ఇలా ఎన్నో రచనలు తెలుగు ప్రజల ఆదరాభిమానాలు పొందాయి. తెలంగాణలో నైజాం వ్యతిరేక పోరాటాలు, రజాకార్ల వలన తెలంగాణ అనుభవించిన రాక్షస హింస, కళ్లకు కట్టేటట్లు 'తాపీ'వారు సంపాదకులుగా ఎన్నో వ్యాసాలు, వార్తలు, వ్యాఖ్యలు వెలుగులోకి వచ్చాయి. హేతువాదిగా, కాలంతో జన సంక్షేమం కాంక్షించే అభ్యుదయ పంథాలో పాత్రికేయునిగా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసారు. స్వతంత్రమైన ధోరణి, ఆలోచనలతో తెలుగు ప్రజకు తన మేధా రచనా సంపన్నతతో ప్రశ్నించే నైజం నేర్పారు. 1973లో కన్ను మూసిన 'ఆంధ్ర విశారద', కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార విజేత తాపీ ధర్మారావు తెలుగు భాష, జన జీవన వికాసానికి ఎనలేని సేవలందించిన ఆదర్శనీయ రచయిత, సాహితీవేత్త, మాతృభాషకు జీవద్భాషగా ప్రాణం పోసిన మహామనీషి.

- జయసూర్య

అద్వైత జన్మస్థలం

అద్వైతం అనే మాట వినగానే ఆదిశంకరాచార్యులవారు, వారి జన్మస్థలమైన కేరళ రాష్ట్రంలోని కాలడి అనే గ్రామం గుర్తుకొస్తుంది. ఎర్నాకులంలో జిల్లాలో ఉంది కాలడి గ్రామం. పెరియార్ నది రెండు పాయలుగా మారి ప్రవహించిన ప్రదేశం కాలడి. ఈ పుణ్య ప్రదేశంలో జన్మించారు ఆదిశంకరులవారు. అతి పిన్న వయసులోనే భారత ఖండం నలుమూలల సంచరించి అద్వైత ప్రకాశాన్ని అందించారు.

మన దేశ చివరి భాగాన ఉన్న కాలడి గ్రామం నుండి యాత్ర ప్రారంభించి కాశ్మీర్‌లో గల శారద క్షేత్రంలో ఉన్న సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించిన కారణజన్ముడు ఆదిశంకరులవారు. 32 సంవత్సరాలు జీవించి మాత్రమే బ్రహ్మచర్యం పాటించి మన దేశం నలు వైపులా అద్వైత అమృతాన్ని అందించి సాక్షాత్ శంకరునిలో ఐక్యం అయ్యారు.

మనసుని శుద్ధి చేసుకుంటే వ్యక్తులకు దైవ భావం కలుగుతుంది. విపరీతమైన ఆలోచనలు తొలగిపోతాయి. అపుడు అద్వైతం మన మనసులోకి ప్రవేశిస్తుంది. అలాంటపుడు భూమి స్వర్గం అవుతుంది అని శంకరాచార్యులవారి ఉపదేశం. వీరు అందించిన సౌందర్యలహరి వంటి ఎన్నో అక్షర సత్యాలు నేటి మానవాళికి మార్గనిర్దేశం, ఆచరణతో జీవిత ముక్తి కూడా కలిగించింది. శ్రీ శంకరులవారు ప్రవచించినవి అన్ని శాస్త్ర నిరూపితం, ఆచరణ యోగం అని మనం గ్రహించాలి. అది పవిత్రమైన జీవన మార్గం కూడా.

కాలడి గ్రామంలోకి అడుగు పెట్టేసరికి ఎనిమిది అంతస్తుల్లో నిర్మించిన శంకర స్థూపం మనకి కనిపిస్తుంది. ఈ స్థూపాన్ని ఆదిశంకర కీర్తిస్తంభ పాదుకా మండపం అని పిలుస్తారు. ఇక్కడ ఆదిశంకరుల వారి పాదుకలు ప్రతిష్ఠించారని సంకల్పం చెప్పి, పూజాదికాలు చేస్తుంటారు. ఈ పాదుకా మండపంలోకి అడుగు పెట్టిన వెంటనే మనకి సప్త మోక్ష ద్వారాలు కనిపిస్తాయి. అవి: అవంతిక, మాయ, అయోధ్య, మధుర, వారణాసి, ద్వారకా, కాంచీపురం.

ఈ మండపంలో ఆదిశంకరులవారి జన్మ వృత్తాంతం చిత్ర రూపంలో మనకి కనిపిస్తుంది. వీరు చేసిన యాత్రలు సామాన్యమైనవి కాదు.

శంకర విజయం అనే కావ్య గ్రంథంలో ఆదిశంకరులవారి జన్మ వృత్తాంతం అక్షర రూపంలో ఉన్నాయి. శివగురు, ఆర్యాంబ దంపతులు సంతానం కోసం 48 శివ భజన చేశారు. అప్పుడు ఆర్యాంబకి కలలో శివ దర్శనం కలిగింది. ఆ తరువాత తేజస్సుతో బాలుడు జన్మించాడు. శివ చైతన్యం వలన శంకర అని పేరు పెట్టారు. బాల్యంలోనే శంకరుల వారికి పితృ వియోగం జరిగింది. అందువలన బాల్యం కష్టాలలో సాగింది. పెరియార్ నదిలో స్నానం చేస్తున్నప్పుడు ఒక మొసలి శంకరులవారి

పాదాలను పట్టుకుంది. అది గమనించిన ఆర్యాంబ ఆ మొసలిని వేడుకుంది వదలమని. అది విని మొసలి శంకరుల వారి కారణం జన్మ రహస్యాన్ని చెప్పి బ్రహ్మచారిగా పంపించమని చెప్తుంది. అది విని ఆర్యాంబ బాధతో అంగీకరిస్తారు. పాదుకా మండపం దగ్గరలోనే ఉంది. శంకర జన్మ స్థలం పెరియార్ నదీ తీరంలోనే ఉంది. అలాగే మొసలి పట్టుకున్న స్థలం ఉంది. 1200 వందల సంవత్సరాల చరిత్ర గల శంకర జన్మ స్థలం 1910లో అధికారికంగా వెలికి వచ్చింది. అప్పటి మైసూర్ రాజు శ్రీకృష్ణ రాజ ఒడయార్ తన దివాన్ శేషాద్రి అయ్యర్, తిరువనంతపురం దివాన్ మాధవ రాయరుల సహకారంతో శంకర జన్మస్థలాన్ని గుర్తించారు.

అప్పుడు తిరువనంతపురం రాజవారు శ్రీ మూలం తిరునాళ్ ఆ శంకర జన్మ స్థలాన్ని శృంగేరి మఠానికి కానుకగా సమర్పించారు. ఇక్కడ ఆర్యాంబ సమాధి, ఆమె వాడిన రాతిదీపం, తులసికోట, స్నానం చేసిన బావి ఉంది. పూర్ణ నదికి అభిముఖంగా ఆదిశంకరులవారి పంచలోహ విగ్రహం ఉంది. ఇక్కడ అఖండ దీపం వెలుగుతూ ఉంటుంది. తూర్పు వైపు బ్రహ్మి రూపంలో శ్రీ శారద ప్రతిష్ట ఉంది. ఎనిమిది రేకులతో ఉండే హృదయ కమలం రూపంలో ప్రతిష్టించిన శ్రీ శారద దేవాలయం మహాశక్తివంతం. మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండా, ఇంకా బ్రహ్మి రూపంలో ఉండే సరస్వతి మాతలు కలసి సప్త మాత దేవాలయం. అపూర్వమైన శక్తి గణపతి ఆలయం కూడా ఇక్కడ ఉంది. ఈ శంకర జన్మ స్థలం 26 ఎకరాలలో విస్తరించి ఉంది. దైవిక అద్వైత భావనతో షోడశ కోణాకారంలో శంకర దేవాలయాన్ని నిర్మించారు. పదహారు కళలతో పరిపూర్ణ ఉపచారాలతో నిర్మించారు.

ఆదిశంకరులవారి కులదైవం శ్రీకృష్ణుని దేవాలయం ఉంది. ఇక్కడ శివగురు, ఆర్యాంబ బాలుడైన శంకరులవారు నిత్య పూజలు చేసేవారు. శంకర విరచితమైన కనకధారాస్తవం పఠించవచ్చు ఇక్కడ.

వైశాఖ మాసంలో అయిదు రోజులు కనకధార యజ్ఞం ప్రతి ఏటా నిర్వహిస్తారిక్కడ. శ్రీ శంకరులవారి ఆయుష్షు 32 సంవత్సరాలకు ప్రతీకగా 32 మంది రుత్విక్కులు కనకధార స్తోత్రం పఠిస్తారు.

గురుకుల విద్యాభ్యాస కాలంలో బాల శంకరులవారు భిక్ష కోసం వెళ్తుండేవారు. ఒకరోజు ఒక ఇంటి ముందు భిక్ష అడిగారు.

ఆ ఇంట్లో ఉన్న వృద్ధురాలు బాధతో ఇల్లంతా వెతికితే ఒక ఉసిరికాయ దొరికింది. దానిని బాలశంకరునికి ప్రేమగా సమర్పించుకుంది.

ఆమె బాధను గమనించి శంకరులవారు అక్కడ కూర్చుని లక్ష్మీదేవిని స్మరిస్తూ కనకధారా స్తోత్రం పఠించారు.

కనకధారాస్తవం విని లక్ష్మీదేవి ప్రసన్నురాలై బంగారు ఉసిరికాయలను ఆ ఇంట్లో వర్షించి వృద్ధురాలిని కటాక్షించారు. ఆ ఇల్లు ఇప్పటికీ ఉంది.

మలయాళంలో మన అంటే ఇల్లు అని అర్థం. ఆ విధంగా సర్వమానవాళికి ఐశ్వర్యం, సంపద కోసం ఆదిశంకరులవారు అందించిన కనకధారా స్తోత్రం ఇప్పటికీ స్మరిస్తున్నాం.

- ఈ.ఎస్.మాధవన్

'చందమామ రావే.. జాబిల్లి రావే' పుస్తకాల్లో చదువుకోవడానికి, యూట్యూబ్‌లో చూడటానికి, వినడానికే పరిమితం అయిపోయింది. చల్లని వెన్నెల వెలుగులో అమ్మ ఒడిలో కూర్చొని బువ్వ తింటూ కమ్మని చందమామ రావే పాట వింటూ అమ్మ ప్రేమను పొందగలిగే బాల్యపు తీపి గురుతులు ఈనాటి పసికూనలకు దొరకకపోవడం ఎంతో విచారదాయకం.

చందమామ రావే

అమ్మ బువ్వ తినిపిస్తున్నప్పుడు పక్కనే ఉన్న నాన్నని చూపిస్తూ "ఇదిగో నాన్న ముద్ద" అంటూ మరొక్క ముద్ద పెట్టడం. అమ్మ పక్కనే బుద్ధిగా అన్నం తింటున్న అన్నను చూపిస్తూ "ఇది అన్న ముద్ద" అనడం. "ఇది తాత ముద్ద, ఇది నాన్నమ్మ ముద్ద" అంటూ చుట్టూ ప్రేమగా కూర్చున్న వారినందరినీ చూపిస్త చిన్న బొజ్జకు బలం కోసం నాలుగు ముద్దలు ఎక్కువ తినిపించే మహత్తర సన్నివేశం కేవలం కథలకు, సినిమాలకే పరిమితం అయిపోతుంది.

"పొద్దున మనం లేవాలి.. పళ్లు బాగా తోమాలి.. గ్లాసుడు పాలు తాగాలి" అని పొద్దునే లేవగానే పిల్లాడితో సమయం గడిపే తండ్రులు అదృశ్యమయ్యారు.

"యూ నో మై కిడ్ ఆర్ సో ఇంటెలిజెంట్, హి నో హౌ టూ ఓపెన్ టూ ట్యూబ్ ఆల్సో" మురిసిపోతూ చెప్తున్న ఆధునిక మమ్మీల కాలం ఇది.

స్మార్ట్ ఫోన్ చేతికిచ్చి పిల్లాడు అందులో ఏవేవో చూస్తూ వుంటే గబగబా నాలుగు ముద్దలు తినిపించేసి, హమ్మయ్య ఒక పని అయిపోయింది అనుకొని తమ తమ పనులలో మునిగిపోయే అమ్మలనూ ఏమనలేని యాంత్రిక జీవితంలో ఉన్నాం.

పిల్లాడు ఫోన్లో ఏం చూస్తున్నాడో గమనించేంత సమయం చిక్కడం లేదు తల్లిదండ్రులకు.

"మా వాడికి ఫోన్ ఉంటే చాలండీ, అల్లరి చేయకుండా ఒక దగ్గర బుద్ధిగా కూర్చుంటాడు" ట్రైన్‌లో ఎదురు బెర్త్ ఆమెతో చెప్తోంది ఒకామె.

"మా పిల్లా అంతేనండీ, టాబ్ ఇచ్చేస్తాను, ఇక మనం అన్నం పెట్టేవరకు మన జోలికే రాదు" మురిసిపోతూ చూపించాడు ఒక తండ్రి.

బెర్త్ చివర ఫోన్లు పట్టుకొని మెడ పూర్తిగా వంచి, కళ్ల ఫోన్లోనికి దించేసి ఈ లోకంతో సంబంధం లేకుండా ఉన్నారు ఆ రెండు మూడేళ్ల పిల్లలు.

ఒకసారి కళ్ల మూసుకొని గతంలోనికి వెళ్తే "బుజ్జీ! చూడు చూడు.. ఆ కొండను చూడు. ఎంత పెద్ద కొండో కదా, ఆ కొండ మీద పెద్ద పెద్ద చెట్లు ఉంటాయి తెలుసా? మబ్బులు ఆ కొండగాలికి కరిగి వర్షంగా కురుస్తాయి".

కిటికీలో నుండి దూరంగా ఉన్న కొండను రెండేళ్ల బాబుకు చూపిస్తున్నాడు తండ్రి.

కొండను, చెట్లను, కదిలిపోతున్న పక్షులను చూస్తూ తండ్రి చెప్పే వూసులతో కేరింతలు కొడుతున్నాడు పసివాడు. ఈ ప్రపంచంలో తన తండ్రిని మించిన మేధావి లేడని ఆ చిన్నారి ఊహ.

కదులుతున్న ట్రైన్‌లో నుండి ప్రతీ ఒక్కటి చూపిస్తున్న తండ్రి పట్ల ఆ పసివానికి ఏర్పడిన ఆరాధనా భావం జీవితాంతం ఆ పిల్లాడి గుండెల్లో స్థిరంగా ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లల మధ్య ఒక బలమైన మానసిక బంధం తయారవుతుంది.

నాన్న ఒడిలో కూర్చొని తల్లి చేతి గోరుముద్దలు తినే పిల్లలు కచ్చితంగా మానసికంగా బలవంతుడు అవుతాడు. అంత భాగ్యం ఇప్పుడు ఎంతమంది పిల్లలకు దొరుకుతుంది అంటే సమాధానం కాసేపు మౌనం వహిస్తుంది.

"ఏవీ తల్లీ! నిరుడు కురిసిన హిమసుమాలు.. బాధపడితే కాలం మారుతుందా?

ఇద్దరూ ఉద్యోగాలు చేస్తేగానీ ఆధునిక సౌకర్యాలు, పెరుగుతున్న ఖర్చులను అందుకోలేని తల్లిదండ్రులు. న్యూక్లియర్ కుటుంబ జీవన విధానంలో అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు ఎక్కడో దూరంగా మిణుకు మిణుకు అంటూ ఉండే పరిస్థితి.

ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్తే పసివాళ్లు ఉదయం నుంచి తిరిగి తల్లో తండ్రో ఎవరో ఒకరు వచ్చేవరకు ఆయాల చేతుల్లో. ఆయాలు పిల్లల ఆలనా పాలనా ఎంత బాగా చూసినా అమ్మా నాన్నలు కాలేరు.

అందరికీ తెలుసు.. స్మార్ట్ ఫోన్‌తో వచ్చే సమస్యలు. కానీ తప్పించుకోలేని గడ్డు పరిస్థితి. సెల్ ఫోన్ నుంచి వెలువడే మైక్రోవేవ్ రేడియేషన్ పిల్లల మెదడు కణజాలాన్ని దారుణంగా దెబ్బతీస్తుంది. ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తో గడిపే పిల్లలందరిలోనూ గమనిస్తున్న సమస్య– ఇతరులతో మాట్లాడే భావ నైపుణ్యాలు పడిపోవడం. ఒంటరిగా కూర్చొని ఫోన్లో తల దూర్చి తమలో తామే నవ్వుకుంటూ, ఏడ్చుకుంటూ ఉండే పిల్లలు ఒక్కసారిగా బాహ్య ప్రపంచంతో సరైన సంబంధాలు పెట్టుకోలేరు. మాటలు వినడం తప్ప పలికే అలవాటు ఏదీ వాళ్లకు?

లోపల ఎన్నో భావాలున్నా వాటిని వ్యక్తపరిచే తీరు లోపిస్తుంది ఫోన్ పీడిత పిల్లలకి.

చిన్న తెరను తదేకంగా మెడను వంచి ఎక్కువ సమయం చూడటం వలన వెన్నుపూసపై ప్రభావం చూపి, పిల్లలలో వెన్ను సమస్యలకు మనమే కారణం అవుతున్నాం.

ఒక ఆరోగ్య నివేదిక ప్రకారం ఫోన్ స్క్రీన్‌ను ఎక్కువ సమయం చూసే పిల్లలలో 'డ్రై-ఐ' వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెప్ప వెయ్యకుండా తదేకంగా స్క్రీన్‌ను చూడటం వలన కళ్లపై ఊరే తడి ఆవిరై కళ్లు పొడిబారుతున్నాయి. అలాగే ఎక్కువ సమయం ఫోన్ స్క్రీన్ చూడటం వలన అందులో కదిలే బొమ్మలు, రంగుల వేగం వలన పిల్లల కళ్లు 'డిజిటల్ ఐ స్ట్రెయిన్'కు గురవుతున్నాయి.

ఫలితంగా వచ్చే కళ్లు అలసిపోవడం, తలనొప్పి, మానసిక సమస్యలు. పిల్లల్లో ఈ సమస్యలకు మనమే కారణం కదా.

ఒక అమ్మ తనకున్న పనుల ఒత్తిడి వలన, నవలలు చదివే అలవాటు వలన పుస్తకాల్లో మునిగి ఆరు నెలల వయస్సు నుండే చిన్నారికి ఫోన్‌తో కాలక్షేపం అలవాటు చేశారు. ఆ పాపకు నాలుగు సంవత్సరాల వయస్సు వచ్చేవరకు మాటలు రాలేదు. మాట్లాడే మాటలు కూడా అర్థం కానీ పదాలే. శారీరకంగా ఏ సమస్య లేదు. కానీ ఫోన్ తప్ప వేరే లోకం లేకపోవడం వలన, ఆ చిన్నారితో ఊసులు ఆడేవారు లేకపోవడం వలన ఈ సమస్య ఏర్పడింది అని వైద్యులు తేల్చారు. స్పీచ్ థెరపీతో ఇప్పుడు మాటలు స్పష్టంగా మాట్లాడుతోంది.

ఒకప్పుడు ప్రతీ ఇంట్లో ఇద్దరూ లేదా ముగ్గురు పిల్లలు ఉండేవారు. వారితో వారు ఆడుకొనేవారు,

మాట్లాడుకొనేవారు, పోట్లాడుకొనేవారు. భావ వ్యక్తీకరణ, భాషా సంపద తెలియకుండానే పెరిగేది. కానీ ఇప్పుడు ఒక్క బిడ్డతోనే సరిపెట్టుకొనే స్థితి ఇప్పుడు. వేలంత పిల్లాడికి కొండంత ఫీజులు. మరి ఆ ఒక్క పిల్లాడు ఎవరితో తన భావాలు పంచుకుంటాడు. అందుకే పిల్లలతో మనమే మాట్లాడాలి. ఫోన్ కాదు.

ఇన్ని సమస్యలు ఉంటే మరి పిల్లలకు ఫోన్ ఎందుకు ఇవ్వడం ఆపలేం? అంటారేమో? ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. మారిన సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వలన తప్పు అని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది పిల్లలకు ఫోన్ ఇస్తున్నారు. మరి దీనికి పరిష్కారం లేదా?

పరిష్కారం ముందు పుట్టి సమస్య ఆ తరువాతనే పుడుతుంది. ఈ సమస్యకు పరిష్కారం మన చేతుల్లోనే ఉంది. జీవితంలో ఏదీ పిల్లల కంటే ఎక్కువ కాదని అందరికీ తెలుసు. పిల్లలతో సమయం గడపడానికి, ఆ గడిపే సమయం కూడా నాణ్యతతో ఉండాలి. ఏదో మొక్కుబడిగా కాకుండా మనం కూడా పిల్లల్లో పిల్లలుగా కలిసిపోవాలి. వారికి అర్థం కాకపోయినా పద్యాలు, రైమ్స్ మీరు వారికి చదివి వినిపించండి. "ఇది ముక్కు, నీ ముక్కెక్కడ?" అంటూ వారి శరీర భాగాలను పరిచయం చేయించండి. ఒడిలో కూర్చోబెట్టుకొని ఊసులు చెప్పండి.

రెండు సంవత్సరాల పిల్లల పిల్లలకు రంగులు పరిచయం చెయ్యండి. మార్కెట్‌లో పిల్లల కోసం రంగుల కాయిన్స్ పెద్దవి దొరుకుతున్నాయి. ముందుగా "ఇది ఎరుపు, ఇది పసుపు, ఇది చూడు ఇది నీలం" ఇలా రంగులను పరిచయం చేసి, అన్నీ రంగుల కాయిన్స్ కలగలిపి ఏదో ఒక రంగు చెప్పి, పిల్లలను ఆ రంగు కాయిన్స్ అన్నీ ఒక పక్కన పెట్టమని చెప్పి, వాళ్ల సరిగ్గా తీస్తుంటే ప్రోత్సహించాలి. ఇది వాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఫోన్ బదులుగా డ్రాయింగ్ పుస్తకం, రంగుల పెన్సిల్ చేతికిచ్చి రంగులు దిద్దమని చెప్పి, ఒకటి రెండు రంగులు మనమే దిద్ది చూపించి మార్గం చూపించవచ్చు. ఇలా ఒకటేమిటి? ఎన్నో రకాలుగా పిల్లలనూ ఆటలు ఆడించవచ్చు. సమయమే లేదు, ఇవన్నీ మాకు తెలియనివి కావు అనుకోవచ్చు.

సమయం ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుంది. కానీ పిల్లల బాల్యం కరిగిపోతే మరి ఎప్పటికీ ఆ అనుభూతులను తిరిగి వెనక్కి తెచ్చి ఇవ్వలేం. మీ మీ వృత్తులలో బిజీగా ఉండొచ్చు. కానీ పిల్లల కోసం, వారి ముఖాల్లో వెలుగులు కోసం కాస్త సమయం కేటాయించండి. ఫోన్ పక్కన పెట్టి, మీ చేతిలోనిది కూడా. వారితో సమయం గడపండి. ఆ ఆనందం మీ వృత్తి ఒత్తిడుల నుంచి కూడా కాపాడుతుంది. పిల్లలకు మీతో బంధం పెంచుతుంది. ఒక్కసారి మీ బాల్యాన్ని గుర్తు తెచ్చుకోండి.. ఇప్పటికీ "ఇతను నా బాల్య స్నేహితుడు" అంటూ ఆ స్నేహితుని భుజం చుట్టూ మీ చేతిని గట్టిగా పెనవేసి ఆ బాల్యపు తీపి జ్ఞాపకాలను అందరికీ గర్వంగా పంచుతారు. ఆ రోజుల్లో మీ నాన్నగారితో కలిసి మెలిసిన జ్ఞాపకాలు మీ గుండెల్లో ఇంకా తాజాగా ఉన్నాయి కదా. మరి మన పిల్లలకు కూడా వారి బాల్యాన్ని అందంగా, అనుభూతులతో నిండి ఉండేలా చేద్దాం. ఏమంటారు?

- జి.వి.శ్రీనివాస్

వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

మేషం

శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది. కళాకారులకు సన్మాన సూచనలున్నాయి. వారాంతంలో రుణాలు చేస్తారు. వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు. ప్రముఖులను సందర్శిస్తారు. కుటుంబంలో వివాదాలకు అవకాశాలున్నాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది.

వృషభం

వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. రుణాలు తీరుస్తారు. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. స్త్రీలకు సమస్యలుంటాయి. అనుకున్న పనులు వారాంతంలో పూర్తి చేస్తారు.

మిథునం

వ్యాపారులకు సామాన్యం. ప్రతికూలతలు వున్నా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. దేశ సంచారం చేస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. క్రయ-విక్రయాలు ఆశాజనంగా ఉంటాయి. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. ఉద్యోగులకు పదోన్నతి లభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం.

కర్కాటం

అకారణంగా మనోవేదనకు గురవుతారు. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నవారికి బాగుంటుంది. ఉద్యోగులకు స్థాన చలనం. భాగస్వామ్య వ్యాపారులు విడిపోతారు. పోటీ పరీక్షల్లో విద్యార్థులకు విజయం లభిస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. ఆకస్మిక ధన ప్రాప్తి.

సింహం



అనుకోని సంఘటనలు ఏర్పడినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు. సామాన్య ధన లాభం. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో ఎటూ నిర్ణయించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. సంయమనంతో వ్యవహరించండి. కొత్త విషయాలు తెలుసుకుంటారు. కోర్టు వ్యవహారాలు సానుకూలం. వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి.

కన్య

దైవ చింతన అలవడుతుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. భాగస్వామ్య వ్యాపారులకు సమస్యలుంటాయి. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. ఉద్యోగులకు ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి. ఖర్చులు అధికం. రుణాలు తీరుస్తారు. ఎదురు చూస్తున్న శుభ వర్తమానం అందుకుంటారు.

తుల

దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. భోజన సౌఖ్యం. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం. భాగస్వామ్య వ్యాపారులు సానుకూల వాతావరణంలో విడిపోతారు. వృత్తి రంగాల్లో వున్నవారికి లాభాలుంటాయి. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. కుటుంబ సమస్యలు తీరుతాయి.

వృశ్చికం

ధన లాభం. వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. వారాంతంలో స్వల్ప ధన నష్ట సూచనలున్నాయి. శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వారాంతంలో రుణాలు చేస్తారు. సహనంతో వ్యవహరించడం అన్ని విధాలా మంచిది. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి ముఖ్య సమాచాం అందుకుంటారు.

ధనుస్సు

పోటీ పరీక్షల్లో విద్యార్థులకు విజయం లభిస్తుంది. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. వాహన యోగం. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. శారీరక శ్రమ అధికం. ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. శుభ వార్తలు వింటారు.

మకరం

దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల రాక ఆనందం కలిగిస్తుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి ఖర్చులు అధికం. భాగస్వామ్య వ్యాపారుల సమస్యలు పరిష్కారం అవుతాయి. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. విదేశీ వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబంలో మనస్పర్థలకు ఆస్కారం. స్త్రీలకు సమస్యలుంటాయి. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది.

కుంభం

సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు. శత్రువులపై విజయం సాధిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. వృథా ఖర్చులను నియంత్రిస్తారు.

మీనం

వృథా కాలక్షేపం చేస్తారు. వారాంతంలో దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. అనుకోని సంఘటనలు జరిగినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు. చిరకాల కోరిక నెరవేరే సూచనలు అధికంగా ఉన్నాయి. చిరు వ్యాపారులకు లాభం.

జలవాస్తు విధానం

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

పడమర-నీటి ప్రవాహం

పైకప్పు పడమర దిశకు వాలుగా ఉన్నట్లయితే చెడు పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఇంటి పైకప్పు పైన పడమర దిశకు నీరు ప్రవహించినట్లయితే దారిద్ర్యం ప్రాప్తించే ప్రమాదముంది.

West-Slab water

West slop terrace brings unfavorable results. If the flow of water on your slab is towards West the occupant will face poverty.



నైఋతి-నీటి ప్రవాహం

పైకప్పు నైఋతి దిశకు వాలుగా ఉన్నట్లయితే చెడు పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఇంటి పైకప్పు పైన నీటి ప్రవాహం నైఋతి దిక్కుకు(దక్షిణ నైఋతి, పశ్చిమ నైఋతి) ప్రవహించినట్లయితే, అకారణ భయం(శత్రుభయం, సమాజ భయం, చట్టభయం) కలిగే అవకాశముంది.

South-West-Slab water

South-West slope terrace brings unfavorable results. If the flow of water on your slab is towards South-West(South South-West and West South-West) the occupant will suffer



from phobias and unwanted fears(legal and hostility).

దక్షిణం-నీటి ప్రవాహం

పైకప్పు దక్షిణ దిశకు వాలుగా ఉన్నట్లయితే చెడు పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఇంటి పైకప్పు



పైన నీరు దక్షిణ దిక్కుకు ప్రవహించినట్లయితే ఆకస్మిక ప్రమాదాల బారిన తరచూ పడవలసి వస్తుంది.

South-Slab water

South slope terrace brings unfavorable results. If the flow of water on your slab is towards South the occupant will face sequence of accidents at a periodical intervals.

ఆగ్నేయం-నీటి ప్రవాహం

పైకప్పు ఆగ్నేయం పల్లంగా ఉండకూడదు. ఇంటి పైకప్పు పైన నీటి ప్రవాహం ఆగ్నేయ దిక్కు(తూర్పు



ఆగ్నేయం, దక్షిణ ఆగ్నేయానికి) ప్రవహించినట్లయితే ధన నష్టం, అనారోగ్యం(ప్రత్యేకించి స్త్రీలకు) ప్రాప్తించే అవకాశముంది.

South-East-Slab water

South-East slope terrace is not accepted as per vaasthu. If the flow of water on your slab is towards South-East(East South-East, South-East) the occupant will face loss of health and wealth(specially for ladies).

తూర్పు-నీటి ప్రవాహం

పైకప్పు తూర్పు దిశకు వాలుగా ఉన్నట్లయితే సత్ఫలితాలుంటాయి. ఇంటి పైకప్పు పైన నీరు తూర్పుదిక్కుకు ప్రవహించినట్లయితే సంతాన ప్రాప్తి కలుగుతుంది. ప్రత్యేకించి పుత్రసంతానం కలిగే అవకాశం ఎక్కువ.

East-Slab water

East slope terrace brings favorable results. If the flow of water on your slab is towards

East the occupant will gain healthy pregnancy that favors birth of a son.

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

పుట్టకు పాలు

హాస్య కథ

"అమ్మాయ్ వేదా, రేపు నాగ పంచమి. మరిచిపోకుండా వెళ్లి పుట్టకు ప్రదక్షిణం చేసి పాలు పోసిరామ్మా!" కూతురికి ఫోన్‌లో చెప్పింది జగదాంబ. వేద పట్నంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కూతురికి త్వరగా పెళ్లి కావాలని వ్రతాలు, పూజలు చేస్తుంటుంది జగదాంబ.

కూతురు చెయ్యవలసిన వాటిని ఫోన్లో పురమాయిస్తుంటుంది. తల్లి మాట కాదనలేక ఎలాగో ఓలాగ చెప్పింది చేస్తుంటుంది వేద. ఇప్పుడు పుట్టకు పాలు పొయ్యమని తల్లి ఆజ్ఞాపించింది.

"అమ్మా, ఈ పట్నంలో పాముపుట్ట ఎక్కడుందో నాకు తెలియదు. నేను వెళ్లను" కచ్చితంగా అంది వేద.

"అలా అనకు.. ఈ ఒక్కసారికి ఎవర్నో ఒకర్ని వెంటబెట్టుకెళ్లి పుట్టలో పాలు పోసిరా" అంటూ కూతుర్ని బుజ్జగించింది.

"ఎవర్ని తీసుకెళ్లాలి? ఏం చెప్పి తీసుకెళ్లాలి?" అని ఆలోచనలో పడింది వేద. మరుసటిరోజు ఉదయం స్నానం చేసి వార్డన్ గదికెళ్లింది వేద. "నమస్తే మేడమ్! ఈ చీరలో మీరు సినిమా హీరోయిన్‌లా ఉన్నారు" అంది వేద. ఓ క్షణమాగి "మీతో ఓ విషయం చెప్పాలని వచ్చాను మేడమ్" అంది వేద.

"ఏంటో అది?" కళ్లు రెపరెపలాడిస్తూ అంది వార్డన్. "నిన్న రాత్రి నాకో కల వచ్చింది మేడమ్" చెప్పింది వేద.

"ఇంట్రెస్టింగ్ మేటర్ ఉంటే వెంటనే చెప్పేయ్" ఆసక్తిగా అడిగింది వార్డన్.

"ఆ కలలో ఒక నాగుపాము కనిపించింది మేడమ!" భయం భయంగా అంది వేద. "అది నాగుపాము అని నీకెలా తెలుసు?" కళ్లెగరేస్తూ లాజిక్ లాగింది వార్డన్.

"నన్ను చూస్తూ అది గుస కొట్టింది మేడమ్" "గుస కాదు బుస" సరిదిద్దింది వార్డన్. "ఆ..ఆ.. అది బుస కొట్టటం నాకు వినిపించింది మేడమ్!"

"అన్ని పాములూ బుస కొడ్తాయ్. తేలిగ్గా అంది వార్డన్. "పక్కనే ఓ పుట్ట కూడా కనిపించింది మేడమ్"

"అది చీమలు పెట్టిన పుట్ట అయ్యుంటుంది" "పాములు సొంతంగా పుట్టలు పెట్టలేవనీ, 'చీమలు పెట్టిన పుట్టలు పాములకు ఇరవైనయట్లు' అని పద్యం చదువుకున్నాం కదా మేడం!"

"నాన్సెన్స్! అదంతా ట్రాష్! నీ కలలో కనిపించిన పాము ఆ చీమలపుట్ట దగ్గరికి మేతకు వచ్చుంటుంది".

"లేదు మేడమ్! అది బుడగ విప్పింది కూడా" "బుడగ కాదు పడగ" సరిదిద్దింది వార్డన్. "అది పడగ విప్పినప్పుడు దాని మీద యూ షేప్‌లో సైన్ కూడా కనిపించింది మేడమ్!"

"అయితే నాగుపామే" క్లారిటీ ఇచ్చింది వార్డన్. "నాకేమైనా చెడు జరుగుతుందా మేడమ్?"

"జరగకపోవచ్చు. ఎందుకంటే అది నిన్ను చూసి బుస కొట్టిందే కానీ కాటెయ్యలేదుగా!" "లేదు మేడమ్. కానీ అది ఇంకొకర్ని కాటేసేందుకు ప్రయత్నించడం నేను చూశాను మేడమ్"

"నీకేం భయం లేదు" ధైర్యమిచ్చింది వార్డన్. "నిజంగానా మేడమ్" "ఔనన్నట్టు" స్టైల్‌గా నవ్వుతూ తలూపింది వార్డన్. "మేడమ్, ఇంకో విషయం చెప్పనా?" అంది వేద.

"చెప్పు.." అదే నవ్వును కొనసాగిస్తూ అంది వార్డన్.

"నిన్న నా కలలో మీరు కూడా కనిపించారు మేడమ్"

"నేనా? ఆర్ యూ ష్యూర్?" ఆసక్తిగా అడిగింది వార్డన్. "యస్ మేడమ్. అదే నవ్వు, అదే చీరకట్టు, అదే పడక" "పడక కాదు నడక" సరిదిద్దింది వార్డన్.

"ఆ..ఆ.. అలాంటి హింస నడక ఇంకెవరూ నడవలేరు మేడమ్"

"హింస కాదు హంస" వేదను గుర్రుగా చూస్తూ అంది వార్డన్.

"ఆ..ఆ.. హంసనడక మీకు కాక మరెవరికి వస్తుంది మేడమ్"

"అది నాగుపాము అని నీకెలా తెలుసు?" కళ్లెగరేస్తూ లాజిక్ లాగింది వార్డన్.
"నన్ను చూస్తూ అది గుస కొట్టింది మేడమ్"

"అలా అంటావా, ఓకే. అయితే అప్పుడు నేనేం చేస్తూ కనిపించాను" ముసిముసిగా నవ్వుతూ అడిగింది. "అప్పుడు మీ చేతిలో ఓ పిర్ర ఉంది మేడమ్" "పిర్ర కాదు కర్ర. ముందు నువ్వు తెలుగు సరిగ్గా పలకవే తల్లీ. వినలేక చస్తున్నా"

"ఆ..ఆ.. కర్రే కదా మీ డిసిప్లెయిన్ సింబల్"

"ఎగ్జాక్ట్లీ. రూమ్స్‌కు రౌండ్స్‌కు వస్తున్నప్పుడు నా చేతిలో కర్ర ఉండటం కామనేగా"

"ఎస్ మేడమ్. కానీ ఆ కర్రతో మీరు చావగొట్టేశారు మేడమ్"

"ఏ స్టూడెంట్‌ను?" ఆదుర్దాగా అడిగింది మేడమ్.

"స్టూడెంట్‌ను కాదు మేడమ్, మిమ్మల్ని కాటెయ్యటానికి ప్రయత్నించిన నాగుపామును".

"నేనా? నాగుపామునా?" కంగారుగా ప్రశ్నించింది.

"ఔను మేడమ్, కలలో నన్ను కాక మరెవర్నో పాము కాటెయ్యటానికి ప్రయత్నించిందన్నానే, అది మిమ్మల్నే.

"నన్నా?" హతాశురాలైంది వార్డన్.

"ఔను మేడమ్. కానీ అప్పుడు మీరు ఎంతో సాహసంతో ఆ పామును కర్రతో కొట్టి చింపేశారు"

"చింపేశారు కాదు చంపేశారు" అని సమర్థించలేక "నిజంగా నేనే చంపేశానా?" అనుమానంతోనే అడిగింది.

"ఔను మేడమ్, మీరే!"

"నేనే చంపాననటానికి ఏమిటి సాక్ష్యం?" మొండిగా ప్రశ్నించింది వార్డన్.

"ఆ పాముపుట్ట పక్కనే మీరు నడిపే 3497 నంబరు స్కూటీ కూడా ఉంది మేడమ్"

"ఔనా, అయితే అది నేనేనేమో" భయం భయంగా అంది వార్డన్.

"మీకేమైనా శాపం చుట్టుకుంటుందా మేడమ్"

"శాపం కాదు పాపం" దిగులుతో సరిదిద్దింది మేడమ్.

"ఆ..ఆ.. ఆ పాప పరిహారానికి మీరేం చేస్తే బాగుంటుందంటారు?" అమాయకంగా మొహం పెట్టి అడిగింది.

"ఏమో తెలీటం లేదు" అయోమయంగా అంది వార్డన్.

నిమిషం గడిచాక వేద "ఆ, నాకు మా అమ్మ చెప్పిన ఒక విషయం గుర్తొస్తోంది మేడమ్. కలలో పాము కనిపిస్తే పుట్టకు పాలు పోస్తే అది సెగ పట్టదట".

"సెగ కాదు పగ" నీరసంగా సరిదిద్దింది వార్డన్.

"ఆ..ఆ.. పగ పట్టక శాంతిస్తుందట"

"అయితే ఇప్పుడే పద. పాలు తీసుకెళ్లి పుట్టలో పోసొద్దాం" అంటూ కదిలింది వార్డన్. "హమ్మయ్య.. ఎలాగో వార్డన్ మేడమ్‌ను ఒప్పించగలిగాను" అనుకుని ముసిముసిగా నవ్వుకుంటూ ఆమె వెనకే బయలుదేరింది వేద.

- జిల్లేళ్ల బాలాజీ

ఈ వారం కా'ర్టూన్స్'


దంచి కొడుతున్న వానలు అని టీవీల్లో చూపిస్తున్నారు..! కానీ మేము కొట్టలేదు డాడీ...! ప్రామిస్...!!
Zakir


జయమాలినీ, జ్యోతి లక్ష్మి పాటలేగా.. చూడనీ... ఏదో వెబ్ సిరీస్ చూస్తున్నట్లు భయపడ్తావ్...!?
Zakir...


అంతా ఉత్తిదే.. నేను పట్టుబడడం లేదు..!!
మీరు సీసీ టీవీ పర్యవేక్షణలో ఉన్నారు
Zakir...

ఫోటో ఫీచర్

ప్రపంచంలోని అద్భుత ప్రదేశాల్లో మౌంట్ ఫ్యాన్జింగ్ పర్వతశ్రేణి ప్రాంతం ఒకటి. ఇక్కడ నిటారుగా ఉన్న రెండు కొండలపై రెండు బౌద్ధ ఆలయాలు , ఆ రెండు కొండలను కలుపుతూ బ్రిడ్జి నిర్మించారు. సముద్ర మట్టానికి సుమారు 9000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ పర్వతాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఈ ఆలయాలను చేరుకోవాలంటే ఎనిమిది వేల మెట్లను అధిరోహించాలి. కేబుల్ కార్లు కూడా అందుబాట్లో ఉంటాయి.